

• ఇక పనుల పరవళ్లు..!

# సాగునీటికి పట్టం



## పోలవరానికి రూ.6,705 కోట్లు.. డెల్టా ఆధునికీకరణకు రూ.200 కోట్లు

### ఎత్తిపోతలకు నిధుల కేటాయింపు.. రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి పశ్చిమకు ప్రాధాన్యం

జిల్లాలో జల వనరులకు అత్యధిక ప్రాధాన్యత కల్పించింది. పోలవరం ప్రాజెక్టు దగ్గర నుంచి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించింది. పంచాయతీరాజ్‌ దగ్గర నుంచి జల జీవన్‌మిషన్‌ వరకు మరిన్ని పనులు ఈ ఏడాది ముందుకెళ్లేలా కేటాయింపులు జరిపింది. వ్యవసాయంతోపాటు ఈ రంగాన్ని నమ్ముకున్న రైతులకు ఊరటకలిగించేలా బడ్జెట్‌ పద్దు. ప్రత్యేకించి ఆక్వాకు, ఇతర రంగాలకు పెద్దగా నిధులు కేటాయించకపోవడంపై పెదవి విరుపులు. అద్భుత బడ్జెట్‌ అంటూ కూటమి అనుకూలురు హర్షామోదాలు. లెక్కలే తప్ప అనుకూల కేటాయింపులు ఏవంటూ విపక్షాల మండిపాటు.

- చింతలపూడికి రూ.222 కోట్లు
- తాడిపూడి ఎత్తిపోతలకు రూ.14 కోట్లు
- అన్నదాత సుఖీభవకు భారీగా కేటాయింపులు
- వ్యవసాయానికి ప్రాధాన్యత, ఆక్వాపై ప్రస్తావన
- జనరంజకమంటూ కూటమి నేతల హర్షం
- ఇవేం లెక్కలంటూ విపక్షాల మండిపాటు



ఎర్రగుంటపల్లి వద్ద అసంపూర్తిగా చింతలపూడి కాలువ

(ఏలూరు/భీమవరం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ జలవనరుల పనుల పురోభివృద్ధికి భారీగా కేటాయింపులు ఇచ్చారు. 2027 చివరి నాటికి పోలవరం పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో బడ్జెట్‌లో రూ.6 వేల 705 కోట్లు కేటాయించి ప్రాజెక్టుల విషయంలో తన నిబద్ధతను వెల్లడించింది. భారీ కేటాయింపుల ద్వారా పనులను పరుగులు పెట్టించడం, అనుకున్న లక్ష్యాలు చేరువకావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తేలింది. నిర్వాసిత కుటుంబాలకు ఈ మధ్యనే రూ.900 కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. కాలనీల్లో పెండింగ్‌ పనులన్నీ పూర్తి చేయడంతో పాటు సాధ్యమైనంత మేర ముంపు గ్రామాల్లో నిర్వాసితులందరినీ కాలనీలకు చేర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

### చింతలపూడికి రూ.222 కోట్లు

చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకం పనులను మరింత వేగంగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ఈ మేరకు నిధులు కేటాయించారు. చింతలపూడి హెడ్‌వర్క్స్‌తో పాటు మిగతా పనులు నిలిచిపోయాయి. వీటిని రెండు దశలుగా పూర్తి చేయాలని సంకల్పించి మొదటి దశలో రూ.222 కోట్లను కేటాయించారు. ఐదేళ్ల జగన్‌ జమానాలో చింతలపూడికి సమృద్ధిగా నిధులు కేటాయించిన పాపాన పోలేదు. దీర్ఘకాలంగా విస్తరణకు నోచుకోని తాడిపూడి ఎత్తిపోతలకు ఈసారి నిధులు కేటాయించారు. ఎనిమిదేళ్లుగా తాడిపూడి కింద పిల్ల కాల్వలను పూర్తి చేస్తే సాగు విస్తీర్ణం పెంచవచ్చని రైతులు డిమాండ్‌కు అనుగుణంగానే రూ.14 కోట్లను కేటాయించారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసేందుకు మరింత చొరవ తీసుకోవాలనే డిమాండ్‌ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి వినిపిస్తూనే ఉంది. మీడియం ఇరిగేషన్‌ పరిధిలోని తమ్మిలేరు, ఎర్రకాల్వ పనులకు నిధులు కేటాయించారు. ఎర్రకాల్వ పరిధిలో పనులకు ఐదు కోట్ల మేర కేటాయింపులు చూపించగా, తమ్మిలేరుకు నిర్వహణ వ్యయాన్ని భరించబోతున్నట్టు ప్రకటించారు.

### వ్యవసాయానికి ప్రాధాన్యత

రైతులు ఆది నుంచి ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి 6 వేల 300 కోట్లు కేటాయింపులు చేశారు. రైతులను ఆదుకునేందుకు వీలుగా కేంద్రం ఇప్పటికే మూడు విడతల్లో ఆరు వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం షేర్‌గా మరో మూడు విడతలపాటు రూ.14 వేల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేయబోతున్నారు. ఈ పథకం మీద రైతులు ఎంతో ఆశ పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో నిధులు సమృద్ధిగా వేశారని కొందరు, కాదు కాదు తక్కువ కేటాయించారని తర్జనభర్జన పడుతున్నారు. ఉద్యాన పంటలకు మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించారు. మామిడికి బడ్జెట్‌లో చేదే మిగిలింది. మామిడి పరిశోధన కేంద్రం, మామిడి ఎగుమతుల ప్రోత్సాహం సంబంధించి ప్రస్తావన లేకపోయింది. ఆక్వా రంగం స్థితిగతులను, విద్యుత్‌ చార్జీలను ప్రస్తావించినా పాత విధానాలతోనే సరిపెట్టేశారు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి కేటాయింపులు దక్కలేదు. పంచాయతీరాజ్‌కు, విద్యా రంగాలకు భారీ కేటాయింపులపై కూటమి అనుకూలురంతా హర్షామోదాలు వ్యక్తం చేశారు.



### గోదావరి డెల్టాకు గుడ్‌ డేస్‌

గోదావరి డెల్టాకు మంచి రోజులొచ్చాయి. ధవళేశ్వరం కేంద్రంగా ఉన్న గోదావరి డెల్టా సిస్టమ్‌ ఆధునికీకరణకు రూ.200 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ఏటిగట్ల అభివృద్ధికి మరో రూ.200 కోట్లు కేటాయించారు. గోదావరి డెల్టాకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధికి ఈ నిధులు దోహదపడనున్నాయి. గత ప్రభుత్వంలో జలవనరుల శాఖకు నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాకాలంలో కూటమి ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించి పనులు చేపట్టింది. లేదంటే నష్టం మరింత తీవ్రమయ్యేది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జలవనరుల శాఖపై దృష్టి పెట్టింది. వేసవిలో పనులు చేపట్టేందుకు జల వనరుల అధికారులు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. అందుకు తగ్గట్టుగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. వీటితో కాలువలు, డ్రెయిన్లను ఆధునికీకరిస్తారు.

### ఇవేం అంకెలంటూ..

రాష్ట్ర బడ్జెట్‌ అత్యద్భుతమంటూ కూటమి అనుకూలురంతా సంబరాలు చేసుకోగా, ఇవేం అంకెలంటూ విపక్షాలు విరుచుకుపడ్డాయి. వైసీపీ దగ్గర నుంచి వామపక్షాల వరకు బడ్జెట్‌లో కేటాయింపులు పట్ల తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశాయి. అనేక రంగాలను విస్మరించారని దుయ్యబట్టారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశావర్కర్ల జీతాల పెంపుదల, చిరుద్యోగులు, స్కీం వర్కర్ల జీతాల గురించి ప్రస్తావనలేదంటూ సీపీఎం తీవ్ర ఆగ్ర హాన్ని వ్యక్తం చేసింది. వైసీపీ సైతం దండగమారి బడ్జెట్‌ అంటూ దుయ్యబట్టింది. ఎంపీ పుట్టా మహేష్‌ దగ్గర నుంచి ఎమ్మెల్యేలు బడ్జెట్‌ను అద్భుతమంటూ కీర్తించారు.

• ప్రజలపై భారాలు..



ఏపీ బడ్జెట్‌ ప్రజలపై భారాలు మోపేలా ఉంది. 80 వేల కోట్లు ద్రవ్యలోటు, 14 వేల కోట్లు పన్ను ఆదాయం, 12 వేల కోట్లు పన్నే తర ఆదాయం చూపించడం ద్వారా ఈ భారాలన్నీ ప్రజల పైనే మోపబోతున్నారు. పోలవరం నిర్వాసితుల ఊసు లేదు. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణానికి కేటాయింపులేవు.

– ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి

• అంతా అంకెల గారడీ..



రాష్ట్ర బడ్జెట్‌ అంతా అంకెల గారడీ. వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. పోలవరం ప్రాజెక్టు అంశాలపై సరైన వివరణ ఇవ్వలేదు. కౌలు రైతులను పూర్తిగా విస్మరించారు.

– మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

• ఆక్వా రంగానికి ఒరిగిందేమీ లేదు



బడ్జెట్‌తో పేదలకు, ఆక్వా రంగానికి ఉపయోగం లేదు. ఆక్వా పరిశ్రమకు కేవలం 38 కోట్లు ప్రకటించడం హాస్యాస్పదం. కైకలూరు మత్స్య కళాశాల నిర్మాణంపై ఎలాంటి హామీ లేదు.

– దూలం నాగేశ్వరరావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు

• బీమా.. ఆరోగ్య ధీమా



పేద వర్గాలకు ఆరోగ్యపరంగా ధీమా కల్పించేందుకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందుకు రూ.19,264 కోట్లు కేటాయించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో పైసా చెల్లించకుండానే చికిత్సలు పొందవచ్చు. ఈ నిర్ణయం ఉమ్మడి పశ్చిమలో లక్షలాది పేద కుటుంబాలకు పెద్ద ఉపశమనం.

• మత్స్యకారులకు వరం



ఉమ్మడి పశ్చిమలోని మత్స్యకారులకు పెద్ద ఊరటనిచ్చేలా మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లు కేటాయించారు. ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.20 వేలు చేస్తామని చెప్పింది. చెప్పినట్లుగానే భారీగా నిధులు కేటాయించింది.

• తల్లులకు ఇక పండగే



సూపర్‌సిక్స్‌ హామీల్లో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు చొప్పున 'తల్లికి వందనం' కింద అందించనున్నారు. మే నెలలో ఈ మొత్తాన్ని జమ చేస్తామని ప్రకటించారు. ఇందుకు ఈ పథకం నిమిత్తం రూ.9,407 కోట్లు కేటాయించింది.

• ఇక తాగునీటి బెంగ తీరినట్లే..



జలజీవన్‌ మిషన్‌ కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే ఉద్దేశంతో ఉమ్మడి పశ్చిమలో లక్షల కుళాయిలను అందించాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్లించడంతో ఈ పథకం నత్తనడకగా మారింది. కూటమి ప్రభుత్వం ఈ పనులను ప్రాధాన్య అంశంగా తీసుకుని రూ.2,800 కోట్లు కేటాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఈ పథకం పూర్తికి ఇకపై నిధుల బెంగతీరినట్లయింది.

• ప్రభుత్వ స్కూళ్లకు శుభవార్త



ప్రభుత్వ పాఠశాలలు ఇకపై విద్యుత్‌ బిల్లులు బాధ తప్పింది. ఈ స్కూళ్లకు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో స్కూళ్లకు నెలకు రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు బిల్లులు వస్తున్నాయి. వీటిని చెల్లించలేక నానా తంటాలు పడే పరిస్థితికి ప్రభుత్వం ఈ నిర్ణయం ద్వారా చెక్‌ చెప్పింది.

• సొంతింటి కల నెరవేరినట్లే



ఉమ్మడి జిల్లాలో సొంతింటి కోసం వేలల్లో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ క్రమంలో గృహ నిర్మాణశాఖకు రూ.6,318 కోట్లు కేటాయించడంతో పేదల ఇళ్లకు నిధుల బెంగ తీరినట్లయింది.

• మరింత ఆదరణ



ఆదరణ పథకం కింద బీసీలకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీపై పరికరాలను అందించేందుకు వెయ్యి కోట్లు కేటాయించారు. బీసీ కార్పొరేషన్‌ ద్వారా వీటిని అమలు చేయనుంది. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించారు. 90 శాతం రాయితీతో కుల వృత్తిదారులకు మత్స్యకారులకు వలలు, బోట్లు, వడ్రంగులకు డిజైన్లు చిత్రించే కటింగ్‌ యంత్రాలు అందించే అవకాశాలు ఉన్నాయి.

• అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం కల్పించారు. తల్లికి వందనం పథకానికి రూ.9407 కోట్లు కేటాయించడం శుభపరిణామం. బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసి 47,456 కోట్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. విద్యా, వైద్యం, జలవనరులు, గృహ నిర్మాణానికి అధిక కేటాయింపులు చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేసి రైతుపక్షపాతిగా నిరూపించుకున్నారు.

– పుట్టా మహేశ్‌కుమార్‌, ఎంపీ

• సమగ్రాభివృద్ధే ధ్యేయంగా..



సూపర్‌-6 పథకాలకు పూర్తి స్థాయి కేటాయింపులు చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌ ఉంది. పేదలకు గృహాలు నిర్మించేందుకు రూ.8,500 కోట్లు కేటాయించడం శుభపరిణామం. జలజీవన్‌ మిషన్‌ పథకానికి 2,800 కోట్లు కేటాయించారు. వైసీపీ రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ స్కాలర్‌షిప్‌ల కోసం 3,377 కోట్లు కేటాయించడంతో ఆయా వర్గాలు సంతోషంగా ఉన్నాయి.

– బడేటి చంటి, ఏలూరు ఎమ్మెల్యే

• జనరంజక బడ్జెట్‌



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ జనరంజకం. జల వనరుల విభాగంలో పోలవరం దగ్గర నుంచి ఎత్తిపోతల పథకాల వరకు పూర్తి చేసే దిశగానే ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. తగినన్ని నిధులను కేటాయించింది. ఐదేళ్లపాటు మూలనపడిన వ్యవస్థలన్నింటికీ తిరిగి జీవం పోసేలా బడ్జెట్‌ ఉంది. ప్రజలు ఏం కోరుకుంటు న్నారో ప్రభుత్వం దానికి అనుగుణంగానే అడుగులు వేసింది.

– గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

• పేదల సంక్షేమ బడ్జెట్‌



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌ పేదల సంక్షేమ బడ్జెట్‌గా ఉంది. తెలుగు భాషా అభివృద్ధికి 10 కోట్లు కేటాయించటం సంతోషదాయకం. జలవనరులకు 18,019 కోట్లు, వైద్య ఆరోగ్యానికి 19,264 కోట్లు, రోడ్ల అభివృద్ధికి 8,785 కోట్లు, గృహ నిర్మాణానికి 6,318 కోట్లు, తల్లికి వందనం, పెన్షన్‌లతోపాటు పలు పథకాలకు చేసిన కేటాయింపులు సముచితంగా ఉన్నాయి.

– కొటికలపూడి గోవిందరావు, జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు

• గ్రామీణాభివృద్ధికి పెద్దపీట



కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పంచాయతీరాజ్‌ శాఖకు రూ.18,848 కోట్లు కేటాయించి గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారు. ఐదేళ్ల బీసీ సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. గత ప్రభుత్వం చేతివృత్తుల వారికి అండగా నిలిచే ఆదరణ పథకాన్ని నిలిపివేసి బీసీలకు అన్యాయం చేశారు. నేడు మళ్లీ ఆదరణ పథకానికి బడ్జెట్‌ కేటాయించి పథకాన్ని పునఃప్రారంభించడం సంతోషదాయకం. బీసీల అభివృద్ధికి దోహదం చేసేలా బడ్జెట్‌ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారు.

– ఘంటా పద్మశ్రీ, జడ్పీ చైర్‌పర్సన్‌

• ఇది ప్రజల బడ్జెట్‌



ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల బడ్జెట్‌ ప్రవేశపెట్టింది. పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి రూ.3.2 లక్షల కోట్ల నిధులు కేటాయించడం, తెలుగు బాషాభివృద్ధికి రూ.10 కోట్లు, సూపర్‌ సిక్స్‌ పథకాల అమలుకు పూర్తి స్థాయి నిధులు కేటాయింపు ఎంతో మేలు చేస్తుంది. గత ప్రభుత్వంలా ఓట్ల కోసం కాకుండా రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా ఉంది.

– భూపతిరాజు శ్రీనివాస వర్మ, కేంద్ర మంత్రి



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్‌

## భక్తిశ్రద్ధలతో శిలువగట్టు తిరునాళ్లు

నూజివీడు టౌన్‌, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):నూజివీడు శిలువగట్టు తిరునాళ్లను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత విజయవాడ నేత్రాసన, మోనిగ్నోర్‌ రెవరెండ్‌ ఫాదర్‌ మువ్వల ప్రసాద్‌ దివ్యబలిపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్షేత్ర రెక్టార్‌ రెవరెండ్‌ ఫాదర్‌ గొర్రుముచ్చు జోసఫ్‌ శిలువ శిష్యరిక ప్రమాణాల గురించి భక్తులకు వివరించారు. ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలతో శిలువగట్టు ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది.



శిలువగట్టు తిరునాళ్ల ప్రత్యేక ప్రార్థనలో భక్తులు

## ఆల్‌ ది బెస్ట్‌

### నేటి నుంచి ఇంటర్మీడియట్‌ పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి

ఏలూరు అర్బన్‌, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్‌ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈనెల 15వ తేదీతో ప్రధాన పరీక్షలు ముగుస్తాయి. 'జిల్లావ్యాప్తంగా పరీక్షలు జరిగే 55 కేంద్రాల్లో అమర్చిన సీసీ కెమెరాలు ఆన్‌ చేశారా? సక్రమంగా పని చేస్తున్నాయా? వాటి సిమ్‌ కార్డులను యాక్టివేట్‌ చేశారా? రాష్ట్ర జిల్లా కేంద్రాల నుంచి పరీక్ష గదులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వీలుగా లైవ్‌ టెలికాస్ట్‌ నిమిత్తం అనుసంధానం చేశారా?' అంటూ ఇంటర్‌ పరీక్షల స్టేట్‌ కంట్రోలర్‌ శుక్రవారం ఇంటర్‌ బోర్డు జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్సులో ఆరా తీశారు. ఇప్పటి వరకు పరీక్ష కేంద్రాల వరకు విద్యార్థులకు తోడుగా తల్లిదండ్రులను అనుమతించే విధానం కొనసాగుతుండగా, ఈసారి విద్యార్థులను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పరీక్షల నిర్వహణ విధులకు నియమితులైన ఇన్విజిలేటర్లతో ఆయా కేంద్రాల సీఎస్‌లు, డీవోలు శుక్రవారం సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఆకస్మిక తనిఖీల నిమిత్తం నియమించిన 3 ఫ్లయింగ్‌, 4 సిట్టింగ్‌ స్క్వాడ్‌ బృందాలు, జిల్లా పరీక్షల కమిటీ (డెక్‌) సభ్యులతో ఆర్‌ఐవో కె.యోహాన్‌ ఏలూరులో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇంటర్‌ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేకాధికారిగా నియమితులైన బి.ప్రభాకరరావు శుక్రవారం ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో పరీక్షల నిర్వహణను ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌ రూమ్‌ నుంచి తనతో పాటు, 'డెక్‌' సభ్యుడు ఒకరు పర్యవేక్షిస్తుంటామని, ఎవరికైనా సమస్యలు తలెత్తితే కంట్రోల్‌ రూమ్‌ ఫోన్‌ నెంబరు 08812-230197కి తెలపాలన్నారు. జిల్లాలో కొన్ని కళాశాలల యాజమాన్యాలు తమకు హాల్‌టిక్కెట్లు ఇవ్వడం లేదంటూ శుక్రవారం కొందరు బాలబాలికలు ఆర్‌ఐవో కార్యాలయానికి తల్లిదండ్రులతో సహా తరలివచ్చారు. ఇంకొందరు విద్యార్థులను పీడీఎస్‌యూ నాయకుడు నాని, తదితరులు వెంటబెట్టుకుని రాగా వారందరికీ కార్యాలయ అధికారులు బీఐఈ వెబ్‌సైట్‌ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్‌ చేసి ఇచ్చి పంపించారు.

'జిల్లాలో ఇంటర్‌ థియరీ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల నుంచి బాలురు 14,561 మంది, బాలికలు 18,950 మంది దరఖాస్తు చేసుకున్నారు. జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ మార్చి 7వ తేదీ నుంచి దశల వారీగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అన్ని పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్‌ జోన్‌'గా ప్రభుత్వం ప్రకటించింది. వాటర్‌బాటిల్‌ తెచ్చుకోవచ్చు. అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫర్నీచర్‌, వైద్య బృందాలను ఏర్పాటు చేశా'మని ఆర్‌ఐవో కె.యోహాన్‌ తెలిపారు.



ఏలూరు ప్రభుత్వ జూనియర్‌ కళాశాల పరీక్ష కేంద్రంలో టేబుళ్లపై హాల్‌టిక్కెట్‌ నంబర్లను రాస్తున్న సిబ్బందికి సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

## ఫలించిన కల

### కొమిరేపల్లి ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం రూ.4.50 కోట్లు మంజూరు : ఎంపీ పుట్టా, కలెక్టర్‌ వెట్రిసెల్వి



దెందులూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కొమిరేపల్లి గ్రామస్థుల కల నెరవేరింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌ కుమార్‌ యాదవ్‌ కృషితో కొమిరేపల్లి వద్ద ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణానికి లైన్‌ క్లియర్‌ అయింది. మండలంలోని గుండగొలను సమీపంలోని కొమిరేపల్లి వద్ద ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి లేక 16వ నెంబరు జాతీయ రహదారి పరిధిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అక్కడ ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు డిమాండ్‌ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఎంపీకి సమస్యను విన్నవించగా ఆయన కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీ, జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్‌ ఇండియా చైర్మన్‌ సంతోష్‌కుమార్‌ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిని మంజూరు చేశారు. శుక్రవారం ఎంపీ మహేశ్‌ కుమార్‌ యాదవ్‌ తన క్యాంప్‌ కార్యాలయంలో కలెక్టర్‌ వెట్రిసెల్వితో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్‌ నియోజకవర్గ పరిధిలోని జాతీ య రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కొమిరేపల్లి అడ్డరోడ్డు వద్ద ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం రూ.4.50 కోట్లను మంజూరు చేసిందని, టెండర్‌ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు చేపట్టి ఆరునెలల వ్యవధిలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏ విదార్థికి అయినా పదో తరగతి కీలకం. ఏం చదవాలన్నా పదో తరగతి పరీక్షల్లో వచ్చే మార్కులే పునాది. విద్యార్థులు వారి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలంటే పదిలో మంచి మార్కులు తెచ్చుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదువుతూ కొన్ని టిప్స్ పాటిస్తూ చదివితే మంచి మార్కులు సాధించడం పెద్ద కష్టం ఏమీ కాదంటున్నారు నిపుణులైన ఉపాధ్యాయులు. మార్చి 17 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల కోసం ఆయా సబ్జెక్టు నిపుణుల సూచనలు, సలహాలతో ప్రత్యేక కథనం..

-తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)



తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

# టార్గెట్ టెన్

## మార్చి 17 నుంచి పది పరీక్షలు.. ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం మీదే

### తెలుగులో పదజాలం, వ్యాకరణంపై సాధన



తెలుగు భాషపై అవగాహన, ప్రతిస్పందనకు 32 మార్కులుంటాయి. గద్యభాగం ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఉపవాచకం నుంచి ఇచ్చే 4 వ్యాక్యాలను ఏ ఖండాలకు చెందినవో గుర్తించి పూర్తి వాక్యరూపంలో రాయాలి. అపరిచిత గద్యలేఖ, సంభాషణ తదితర రూపంలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి. రెండో విభాగంలో వ్యక్తీకరణ, సృజనాత్మకతకు 36 మార్కులు ఉంటాయి. పద్య భాగం నుంచి కవి పరిచయం, వ్యాసరూప ప్రశ్నలు గద్యభాగంలో ప్రక్రియ లేదా నేపథ్యం అడుగుతారు. రామాయణంలో ఒక పాత్ర స్వభావం వివరించాలి. మూడో విభాగంలో పద్య, గద్య భాగాల్లోని భాషాంసాలు , పదజాలం వ్యాకరణాంశాలు, పద విజ్ఞానంపై ప్రశ్నల అడుగుతారు.

**- మానేపల్లి నాగేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు, జగన్నాథపురం**

### హిందీ సబ్జెక్టులో అధిక మార్కులు



హిందిలో సులభంగా అధిక మార్కులు సాధించవచ్చు. సెక్షన్ 1లో 12 ఐచ్ఛిక వ్యాకరణ సంబంధ ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్ 2లో 9,10 పాఠాల నుంచి పఠిత గద్యాంశంలో 5 మార్కులకు ఐదు ప్రశ్నలు 3, 5 పాఠాల నుంచి పఠిత పద్యాంశంపై 5 ప్రశ్నలు ఇస్తారు. అపఠిత గద్యపద్య పేరాల నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్ 3లో ఓ ప్రాచీన కవి లేదా నవీన కవి పరిచయంపై 5 మార్కులు ఉంటాయి. పరిచయ పేరాలను చదివి ఖాళీలను పూరిస్తే 5 మార్కులు పొందొచ్చు. పాఠాల చివరనున్న ప్రశ్నలకు జవాబులు బాగా చదివి సెక్షన్ 4లో ఇచ్చే 8 ప్రశ్నల్లో 6 ప్రశ్నలకు 5-6 వ్యాక్యాల్లో జవాబులు రాస్తే 24 మార్కులు పొందవచ్చు.

**- కార్తీక్, హిందీ పండిట్, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్**

### ఆసక్తి పెంచుకుంటే ఇంగ్లీషు ఈజీ..



ఇంగ్లీష్ పట్ల ఆసక్తి కనబరిస్తే అధిక మార్కులు సాధించవచ్చు. ఈ ఏడాది ప్రశ్నాపత్రాల్లో మార్పులు గుర్తించి సాధన చేయాలి. డైరెక్ట్, ఇండైరెక్ట్ స్పీచ్, ఎడిటింగ్ ప్యాసేజ్, ఎర్రర్ కనెక్షన్, టు, ఉడ్ ఉపయోగించి రాయడంపై పట్టు సాధించాలి. డీస్క్రిప్ట్ రైటింగ్, స్క్రిప్ట్ ఫర్ స్పీచ్‌లో రచనా నైపుణ్యాన్ని సాధించాలి. వెనుకబడిన విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే కాంప్రహెన్షన్, జంబుల్డ్ సెంటెన్స్ వరుస క్రమంలో రాయడం, గ్రామర్‌లో రిలేటివ్ క్లాస్, ఇచ్చిన రెండు వాక్యాలను కలపడం, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ గివింగ్ ఎడ్వైజ్, సజెషన్, వకాబులరీ, డిక్షనరీ స్కిల్స్, క్రియేటివ్ రైటింగ్‌లో డైరీ ఎంట్రీ, లెటర్ రైటింగ్ అంశాలపై పట్టు అవసరం.

**వీఎస్ఎన్ సునీత, ఇంగ్లీష్, ఉపాధ్యాయురాలు**

### ప్రణాళికాబద్ధమైన ప్రిపరేషన్ అవసరం



పదో తరగతి పరీక్షలు ఇంకా 15 రోజులు కూడా లేవు.. విద్యార్థులను చదవండి.. చదవండి అంటూ ఒత్తిడి చేయడం మంచిది కాదు. ఇప్పటికే వారికి బోధించిన సబ్జెక్టుల వారీగా రివ్యూ చేసి వారి ప్రతిభ ఆధారంగా ప్రణాళికాబద్దంగా ముందుకు వెళ్లాలి. మండలంలోని పాఠశాలన్నింటికీ స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఒత్తిడిని జయించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

**వి.హనుమ, ఎంఈవో, తాడేపల్లిగూడెం**

### సోషల్‌లో మ్యాపుపై పట్టు సాధించాలి



సాంఘిక శాస్త్రంలో మ్యాప నైపుణ్యాలపై పట్టు అవసరం. ప్రపంచ పటం, భారతదేశ పటాన్ని బాగా గుర్తుంచుకోవాలి. పట్టికలు, గ్రాఫ్‌లు విశ్లేషించమనే అవకాశం ఉంటుంది. ప్రజాస్వామ్యం విజయవంతం చేసేందుకు సూచనలు వంటి ప్రశ్నలు ఉంటాయి. సమకాలీన అంశాలపై ప్రతిస్పందనలు, ప్రశ్నించడం, విద్యాప్రమాణాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరక్షరాస్యత, ఆదాయ అసమానతలపై ప్రశ్నలు ఉంటాయి. ఈ టాపిక్స్ బాగా చదివి అర్థం చేసుకుని ఒకసారి రాసుకోవడం వల్ల పరీక్షల్లో ఉపయోగపడుతుంది.

**- ఎస్.విజయశ్రీ, సాంఘిక శాస్త్ర జిల్లా రిసోర్స్ కోఆర్డినేటర్**

### సాధనతో మ్యాథ్స్‌లో సులభంగా మార్కులు



మ్యథ్స్‌లో సాధన చేస్తే సులభంగా మార్కులు సాధించవచ్చు. సెక్షన్ 1లో 12, సెక్షన్ 2లో 16, సెక్షన్ 3లో 32, సెక్షన్ 4లో 40 మార్కులకు పేపర్ ఉంటుంది. సంభావ్యత చాప్టర్‌లో అన్ని సమ స్యలపై ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లను పరిశీలించి సమాధానాలు రాయాలి. సాంఖ్యక శాస్త్రంలో వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతం, బహుళకాన్ని గుర్తించాలి. రెండు చర రాశుల్లో రేఖీయ సమీకరణాల జతలో గ్రాఫ్ ద్వారా సాధన, చతురస్ర శీర్షాలను చూపండి వంటి 8 మార్కుల ప్రశ్నలకు సాధన చేయాలి. వర్గ సమీకరణాలు, అంకశ్రేణులు, త్రికోణమితి పరిచయం, వృత్తాలు, ఉపరితల వైశాల్యాలు ఘన పరిమాణాలు చాప్టర్లపై పట్టు అవసరం. వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతం, బహు ళంకాన్ని గుర్తించి సూత్రాన్ని రాసి పదాలను వివరించాలి.

**-ఎం.అనురాధ, గణిత టీచర్, కొమ్ముగూడెం**

### ఇవి చదివితే జీవశాస్త్రం కష్టమేమీ కాదు



జీవశాస్త్రంలో మొదటి అధ్యాయంలో లైఫ్ ప్రోసెస్ (జీవక్రియలు), జీవుల్లో ప్రత్యు త్పత్తి, అను వంశికత యూనిట్‌ను బాగా చదువుకోవాలి. వ్యాసరూప ప్రశ్నలు ఎక్కువ వస్తాయి. మానవ విసర్జక వ్యవస్థ, పుష్పనిర్మాణం, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, మానవునిలో లింగనిర్ధయం, నెఫ్రాన్, న్యూరాన్, మెదడు నిర్మాణం చిత్రాలను బాగా సాధన చేయాలి. కిరణ జన్య సంయోగ క్రియకు కార్బన్ డైఆక్సైడ్ అవసరం, పిండి పదార్థంపై లాలాజల చర్య, రైజోఫస్ ప్రయోగాల గురించి వివరంగా నేర్చుకోవాలి. పట్టికలు, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి.

**-బి.అరుణ, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, తాళ్లముదునూరుపాడు**

### జనరల్ సైన్స్‌లో బ్లూ ప్రింట్ మాదిరి ప్రశ్నలు కీలకం



జనరల్ సైన్స్ ప్రశ్నపత్రం 4 సెక్షన్‌లుగా ఉంటుంది. సెక్షన్ 1లో ఒక మార్కు ప్రశ్నలు 8, సెక్షన్ 2లో రెండు మార్కుల ప్రశ్నలు 3, 3వ సెక్షన్‌లో 4 మార్కుల ప్రశ్నలు 3, 4వ సెక్షన్‌లో 8 మార్కుల ప్రశ్నలు మూడింటికి సమాధానాలు రాయాలి. రసాయన చర్యలు, రకాలు, వాటి ఉదాహరణలు, సమీకరణలు, తుల్యం చేయడం, లవణాలు-ఫార్ములాలు, లవణాలు-ప్రయోగాలు, ఆమ్లాలు, ధర్మాలు, కృత్యాలు, పట సహాయంతో కృత్యాల వివరణ, లోహాల ధర్మాలు, లోహాల చర్యాశీలత ఆధారిత, కృత్యాలు, హైడ్రోకార్బన్‌లు, రకాలు, ఫార్ములాలు, ధర్మాలు సంకలన చర్యలు, ప్రతిక్షేపణ చర్యలు దర్పణాలు, కటకాల బేధాలు,కిరణ చిత్రాలు గీయడం దర్పణ సూత్రం ఆధారిత సమస్యలు, హ్రస్వదృష్టి దీర్ఘ దృష్టి సమస్యలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

**- పి.శ్రీనివాసరావు, ఫిజికల్ సైన్స్ టీచర్, తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూల్**

---



వైష్ణవి, ఆమె తండ్రి మనోజ్‌లను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

## అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా వైష్ణవి

**నియామకపత్రం అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

ముదినేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని, సమాజ సేవకురాలు అంబుల వైష్ణవి నియమితులయ్యారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైష్ణవికి నియామకపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానం రావడంతో వైష్ణవి తండ్రి మనోజ్‌తో వెళ్లి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు.అమరావతి ఔన్నత్యాన్ని కాపాడేందుకు, బ్రాండ్ అంబాసిడర్‌గా బాధ్యతలను నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఈ విధులతో పాటు వైద్య విద్యను కొనసాగించాలని వైష్ణవికి చంద్రబాబు సూచించారు.

**భూములు అమ్మి అమరావతి, పోలవరానికి విరాళం**

వైష్ణవి చిన్నతనం నుంచి తన తండ్రి ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ మనోజ్ సహకారంతో తోటి విద్యార్థులకు సాయం చేయడమే కాకుండా పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేది. 2018లోనే ఆమె అమరావతి నిర్మాణానికి, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి, పోల వరం ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.14 లక్షలు విరాళం ఇవ్వగా అప్పట్లోనే వైష్ణవిని సీఎం చంద్రబాబు అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. 2024లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే గతేడాది జూన్‌లో ఎకరం భూమి,బంగారపు గాజులు అమ్మి వైష్ణవి రూ.26 లక్షలు అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, అనంతరం అర ఎకరం భూమి అమ్మి రూ.13 లక్షలు రాష్ట్ర కొత్త సచివాలయ భవనాల నిర్మాణానికి చంద్రబాబుకు అంద జేశారు. వైష్ణవికి అమరావతిపై ఉన్న మక్కువకు స్పందించిన చంద్రబాబు తిరిగి ఆమెను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు.

## చంద్రపుష్కరిణిలో విహరించిన సోమేశ్వరుడు



భీమవరం టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి చంద్ర పుష్కరిణిలో కల్యాణమూర్తులైన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి విహరించారు. ఆలయంలో స్వామివారికి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనతరం ప్రత్యేక వాహనాల్లో క్షేత్రపాలకుడైన జనార్ధనస్వామి, వెంట రాగా స్వామివారు, అమ్మవారులు ప్రత్యేకంగా తయారుచేసిన హంస వాహనంలో ఆశీనులయ్యారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ హారతులు ఇచ్చిన అనంతరం మేళతాళాలు, వేద మంత్రాలు, బాణసంచా కాల్పుల మధ్య చంద్రపుష్కరిణిలో విహరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

### పూల రథంపై ఆలయానికి చేరిన స్వామి

గురువారం నాచువారి సెంటర్ వరకు రథోత్సవం సాగగా శుక్రవారం ఉదయం పూల రథంలో తిరిగి స్వామి, అమ్మవారు ఆలయానికి చేరుకున్నారు. రథానికి గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పూలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. ప్రయాగవారి కుటుంబ సభ్యులు అమ్మవారికి వడుగంటు బియ్యం అందించారు. అమ్మవారికి పూజలు చేసి హారతులు ఇవ్వడంతో భక్తులు జయజయధ్వానాలతో మంగళ వాయిద్యాలు, కేరళ డప్పులు సందడితో రథాన్ని ముందుకు లాగారు. అయ్యగారి వీధి మీదుగా రథం బయలుదేరింది. అయితే ఈ రోడ్డులో రోడ్డుపైకి ఆక్రమణలు రావడం, ర్యాంప్‌లు ఉండతో రథోత్సవానికి ఆటంకం కలిగింది.దీంతో రథం దాదాపు గంటకు పైగా నిలచిపోయింది. ర్యాంప్‌లను పగులగొట్టి మార్గం సుగమం చేసిన తరువాత బయలు దేరింది. అక్కడ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయానికి చేరుకోవడంతో ఆధికారులు, పోలీసులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి వసంత్సోవం నిర్వహించి గ్రామోత్సవం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ భీమారావు పర్యవేక్షణలో డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో బారీ బందోబస్తు నిర్వహించారు.

## చికెన్, కోడిగుడ్ల వినియోగంతో ఇబ్బందులు లేవు

### తణుకులో చికెన్, ఎగ్ మేళా

తణుకు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చికెన్, గోడిగుడ్ల వినియోగం వల్ల బర్డ్‌ఫ్లూ సోకదని ఎలాంటి సందేహాలు లేకుండా తినవచ్చని నెక్ చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం తణుకు నెక్ కల్యాణ మండపంలో వెన్‌క్యాబ్, వెంకటేశ్వరా హేచరీస్ ఆధ్వర్యంలో చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన వివరాల ప్రకారం మనం తినే ఆహార పదార్థాలను 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తే ఎలాంటి వైరస్ అయినా నశిస్తుందని, ఉడికించిన కోడిగుడ్లను, చికెన్ తినడం వల్ల ఎలాంటి ఇబ్బందులు వుండవన్నారు. ఈ సందర్భంగా ఉడికించిన కోడిగుడ్లతో పాటు చికెన్‌తో చేసిన వివిధ రకాల వంటకాలను పౌల్ట్రీ రైతులు, సిబ్బందితో పాటు పరిసరాల ప్రజలకు పంపిణీ చేశారు. సుమారు 200 మందికి పైగా ఈ చికెన్, ఎగ్ మేళాలలోని పదార్థాలను రుచి చూశారు. నెక్ సభ్యులతో పాటు మండల పశువైద్యాధికారి శంకర్ భావనారాయణ పాల్గొన్నారు.



తణుకులో జరిగిన చికెన్, ఎగ్ మేళాలో చికెన్‌తో తయారు చేసిన వంటకాలను వడ్డిస్తున్న నెక్ చైర్మన్, ఇతర సభ్యులు

**మార్చి 5న భారీ చికెన్ మేళా**

మార్చి 5వ తేదీన సుమారు 5 వేల మందితో తణుకులో భారీ చికెన్ మేళా నిర్వహిస్తున్నట్లు నెక్ చైర్మన్ సుబ్బారావు తెలిపారు. ఈ మేళాలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మురళీ కృష్ణ,ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

### రెండు ప్రాంతాల్లో మినహా అన్నిచోట్ల గుడ్లు, చికెన్ అమ్మకాలు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వేల్పూరు కృష్ణానందం కోళ్ల పారం నుంచి ఒక కిలోమీటర్ పరిధిలోను, పెదతాడేపల్లి రామలక్ష్మి కోళ్ల పారం నుంచి ఒక కిలో మీటర్ పరిధిలో మినహా జిల్లాలోని అన్ని గ్రామాల్లో గుడ్లు, చికెన్ విక్రయాలకు ఎటువంటి ఆంక్షలు లేవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజలు ఏ విధమైన అపోహలు లేకుండా ఉడికించిన గుడ్లు, ఉడక బెట్టిన కోడి మాంసం తీసుకోవచ్చని తెలిపారు.

## నేత్రపర్వం.. శివదేవునికి వసంతోత్సవం



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శివదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం త్రిశూల స్నానం వసంతోత్సవం నిర్వహించారు. క్షేత్రపాలకుని ఆలయంలో ఉదయం శ్రీచక్రవార్యుత్సవం, మహా పూర్ణాహుతి అర్చకులు శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం గంగాపార్వతీ సమేత శివదేవుని ఉత్సవమూర్తులను పూలమాలికలతో అలంకరించిన వాహనంలో ఉంచి పూజాధికాలను చేశారు. అనంతరం మేళతాళాల నడుమ శివదేవుడు కొలువైన వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతీ ఇంటి ముందు స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులివ్వగా, అర్చకులు వారికి వేడుకగా వసంతాలను అందించారు. ఆ తరువాత ఆలయంలో రాత్రి ధ్వజ అవరోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## ఆడపిల్లలకు చదువుతోనే ఉన్నత భవిష్యత్తు

**కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ**

భీమవరం టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) చదువుతోనే ఆడపిల్లలకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని, 50 సంవత్సరాల క్రితమే తన తండ్రి తన ముగ్గురు సోదరీ మణులను చదివించారని వారితో పాటు తాను కూడా ఉపాధ్యాయ వృత్తి చేశానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. 38 సంవత్సరా లుగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భూపతి రాజు నాగ శిరోమణి పదవీ విరమణ కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తాను ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల త్వరలో తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసే ట్రస్టు నిర్వహణ బాధ్యతను ముగ్గురు సోదరీ మణులు చూస్తారని, పార్లమెంట్ సభ్యు డిగా ఐదు సంవత్సరాలు తనకు ప్రభుత్వం నుంచి వచ్చే సొమ్ము కూడా ట్రస్టుకు కేటాయి స్తానని తెలిపారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రపంచంలో అతి ఉత్తమమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తిని, తల్లిదండ్రులు జన్మ నిస్తే సరియైన దానిలో విద్యార్థిని నడిపించేది ఉపాధ్యాయులే అన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సమాజం సంతోషంగా సుఖంగా ఉందంటే అది ఉపాధ్యాయుల వల్లే అన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా సత్య నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన సోదరిని సత్కరించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ



జిల్లా సెంట్రల్ జోన్ కబడ్డీ పోటీలలో ద్వితీయస్థానం సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

## జిల్లా స్థాయి కబడ్డీలో కొమరవరం విద్యార్థినులకు ద్వితీయ స్థానం

తణుకు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) పశ్చిమ గోదావరి జిల్లా సెంట్రల్ జోన్ గేమ్స్ బాలికల కబడ్డీ పోటీలలో తణుకు రూరల్ మండలం కొమరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో రన్నర్ నిలిచినట్లు పాఠశాల హెచ్ఎం వెంకట లక్ష్మీ తెలిపారు. తణుకు నియోజవకర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయిలో ద్వితీయస్థానం సాధించిన కొమరవరం పాఠశాల కబడ్డీ జట్టును, పాఠశాల వ్యాయామోపాధ్యాయులను అభినందించారు.



ఏపీ నిట్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆచార్యులు

# దేశ ప్రగతికి పరిశోధనలు కీలకం

» ఏపీ నిట్‌లో సైన్స్ డే

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతికి సైన్స్ పరిశోధనలు కీలకమని వరంగల్ నిట్ గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ జేవీ.రమణమూర్తి అన్నారు. ఏపీ నిట్‌లో స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణమూర్తి మాట్లాడుతూ భారతదేశం గర్వించే వ్యక్తి సీవీ రామన్ అని కొనియాడారు. అపార సేవలందించి ప్రతిష్టాత్మక భారతరత్న పురస్కారం అందుకున్న మహోన్నత వ్యక్తి అన్నారు. విద్యార్థులంతా ఆయన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మొట్టమొదట నోబెల్ బహుమతి అందుకుని దేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడన్నారు. విద్యార్థులు రామన్ సేవలను ఆదర్శంగా తీసుకుని నవ చైతన్యానికి నాంది పలకాలన్నారు. డీన్‌లు కె.హిమబిందు, ఎన్.జయరాం, వి.సందీప్ మాట్లాడారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిట్ విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులను పెదతాడేపల్లిలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులు తిలకించారు. సైన్స్‌డే కార్యక్రమంలో వివిధ విభాగాల ఆచార్యులు టి.కురువయ్య, జె.కృష్ణమూర్తి, సురేంద్ర, శరద్‌ద్వివేది, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కేఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2025-2026 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం, 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ శుక్రవారం తెలిపారు. బూసరాజుపల్లి బాలికల గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు 6, 7, 8, 9 తరగతుల్లో 7 సీట్లు, కేఆర్.పురం బాలుర గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు, 6, 7, 8, 9 తరగతుల్లో 5 సీట్లు, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గిరిజన బాలుర గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు, 6, 7, 8, 9 తరగతుల్లో 35 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 5వ తరగతిలో చేరేందుకు కేటగిరీల వారీగా అర్హత ఉందని, 6 నుంచి 9 తరగతుల్లో కేవలం గిరిజనులకు మాత్రమే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మార్చి 25లోపు దరఖాస్తు చేసుకోవాలని, జులై 6న కేఆర్.పురం, బూసరాజుపల్లి, బర్రింకలపాడు గురుకులాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మూడు గురుకులాల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని పీవో నాయక్ తెలిపారు.



శామ్యూల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, ఎమ్మెల్యే వెంకట్రాజు, నేతలు

## టీడీపీలో చేరిన ద్వారకాతిరుమల జడ్పీటీసీ

**పార్టీ కండువా కప్పిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

ఏలూరు/ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలకు చెందిన వైసీపీ నాయకుడు, జడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ టీడీపీలో చేరారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, సీనియర్ నాయకులు పోలన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీలో చేరారు. శామ్యూల్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన పల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజాపాలనకు ఆకర్షితులై పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పోలిన శ్రీను, తూంపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం అక్రమ నిల్వ కేసు విచారణ వేగవంతం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్రులో మద్యం అక్రమ నిల్వల కేసు విచారణను ఎక్సైజ్ పోలీసులు వేగవంతం చేశారు. భారీ ఎత్తున పట్టుబడిన మద్యం ఎక్కడ నుంచి తెచ్చారు, ఎలా తెచ్చారని విచారిస్తున్నారు. ఈ కేసులో బర్రె జయరాజు, గొల్లమందుల రాజబాబును ఇప్పటికే అరెస్ట్ చేయగా కోర్టు రిమాండ్ విధించింది. కోర్టు అనుమతితో రెండు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారిస్తామని సీఐ రాంబాబు తెలిపారు. యానాంకు చెందిన భరత్‌రెడ్డిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు ఏర్పాటు చేసామన్నారు. భరత్‌రెడ్డి దొరికితే గాని ఈ కేసులో చిక్కుముడి వీడదన్నారు. మద్యం కేసును లోతైన విచారణ చేసేందుకు విచారణాధికారిగా ఎక్సైజ్ సహాయ కమిషనర్ ఆర్‌వి ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీలత నియమితులైనట్లు సీఐ చెప్పారు.

## ప్రైవేట్ అంబులెన్స్‌ల ఫిట్‌నెస్ తనిఖీ



అంబులెన్స్ తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం నుంచి రోగిని తరలిస్తున్న అంబులెన్స్ శుక్రవారం తెల్లవారుజామున భీమడోలులో డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాలతో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు అంబులెన్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్సులను శుక్రవారం తనిఖీ చేపట్టారు. ఆశ్రం, ప్రభుత్వాసుపత్రి ప్రాంతాల్లో అంబులెన్సు లను పరిశీలించారు. వాహనంలో ప్రథమ చికిత్స కిట్, ఆక్సిజన్ సిలిండర్, అత్యవసర సామగ్రి అధికారులు పరిశీలించారు. వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు డ్రైవర్లకు సూచించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌డి విఠల్, బి.శేఖర్ పాల్గొన్నారు.

## పైడిపర్రులో చోరీపై దర్యాప్తు ముమ్మరం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్, సీఐ కొండయ్య

తణుకు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పైడిపర్రులో శుక్రవారం జరిగిన చోరీ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు మూడు వీధుల వెనక జరిగిన చోరీ ఘటనతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. కొంతకాలంగా పైడిపర్రులో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శుక్రవారం బంగారు, వెండి వస్తువులతో పాటు నగదు కూడా దొంగలు దోచుకుపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్ఐ చెప్పారు. సుమారు 30 కాసుల బంగారు వస్తువులు, అరకేజీ వెండి, నగదు దొంగలు దోచుకున్నట్లుగా బాధితులు చెబుతున్నారు. దీనిపై ఇంకా రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్ఐ తెలిపారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ డి.విశ్వనాథ్, పట్టణ సీఐ ఎన్ కొండయ్య, ఇతర పోలీస్ అధికారులు పరిశీలించారని, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి నిందితులను గుర్తించే పనిలో వున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

భీమవరం క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి భార్యాభర్తలు బయటకు వెళ్లి వచ్చేసరికి దొంగలు బంగారు వస్తువులు నగదు దోచుకుపోయారు. టూటౌన్ ఎస్ఐ ఫజల్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపురం గొట్టుముక్కల వారి వీధికి చెందిన నీలపల్లి శ్రీనివాస్ భీమవరం మల్టీప్లెక్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం భార్యాభర్తలు బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఉన్నాయి. ఇంట్లోని హ్యాండ్ బ్యాగ్‌లో 14 గ్రాముల బంగారు వస్తువులు, రూ. 15 వేలు నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రహ్మాన్ తెలిపారు.



బ్యాలెట్ బాక్సులను స్వీకరిస్తున్న అధికారులు

### పట్టభద్రుల

# తీర్పు భద్రం

**ఏలూరులోని స్ట్రాంగ్‌రూమ్‌కు చేరిన బ్యాలెట్ బాక్స్‌లు**

**అభ్యర్థుల సమక్షంలో సీల్‌వేసిన అధికారులు**



స్ట్రాంగ్ రూమ్ భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఆర్వో

ఏలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. జిల్లాల వారీగా బ్యాలెట్ బాక్స్‌లను శుక్రవారం ఉదయం సీఆర్.రెడ్డి కళాశాల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు చేర్చారు. తొలుత ఏలూరు జిల్లా నుంచి రాగా, చివరిగా కాకినాడ జిల్లా నుంచి పోలీస్ భద్రతా ఏర్పాట్ల నడుమ బాక్స్‌లను అధికారులు స్వీకరించారు. ఆయా రెవెన్యూ డివిజన్ల అధికారుల పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులకు సీల్ వేశారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు మూడంచెల భద్రతను ఏర్పాటుచేశారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికల పరిశీలకులు సీహెచ్.శ్రీధర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అంబరీష్, ఏలూరు కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ జీవీ.శేషగిరిరావు పాల్గొన్నారు.



# నిబంధనలు మీరితే జరిమానా

**నేటి నుంచి కొత్త మోటారు వాహన చట్టం అమలు**

» హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుంటే మూల్యం తప్పదు

» వాహనంపై సెల్‌ఫోన్ మాట్లాడితే చాలా చెల్లించుకోవాలి

» వాహన బీమా.. పొల్యూషన్ పత్రం ఉండాల్సిందే

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహన చట్టాలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో అమలు చేయాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వాహనదారులపై మార్చి 1 నుంచి కొత్త చట్టాల ప్రకారం జరిమానాలు పడనున్నాయి. ఇప్పటి వరకూ రూ.100, రూ.500, రూ.1000 వరకూ జరిమానాలు ఉండగా కొత్త చట్టం ప్రకారం రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకూ జరిమానాలు ఉన్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే వారిపై ఎడాపెడా జరిమానాలు పడనున్నాయి. నూతన మోటరు వాహన చట్ట నిబంధనల జీవో నెంబర్ 21 ప్రకారం అమలు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. శనివారం నుంచి రాష్ట్రంలో అమలు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు

- హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే సెక్షన్ 194(డి) ప్రకారం వాహనం నడిపే వ్యక్తికి రూ. వెయ్యి, వెనుక కూర్చున్న వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా.
- వాహనానికి బీమా లేకుంటే 196ఎ సెక్షన్ ప్రకారం మొదటిసారి రూ.2వేల జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.4 వేల జరిమానా.
- లైసెన్సు లేకుండా వాహనం నడిపితే సెక్షన్ 181 ప్రకారం రూ.5 వేల జరిమానా.
- పొల్యూషన్ ధ్రువపత్రం లేని వాహనదారుకు 190 (2) ప్రకారం రూ.1500 జరిమానా.
- వాహనం నడిపేటప్పుడు చేతిలో సెల్‌ఫోన్ ఉన్నా సెక్షన్ నెంబర్ 184 ప్రకారం మొదటిసారి రూ.1500, రెండోసారి పట్టుబడితే రూ. 10వేల జరిమానా.
- యూనిఫామ్ లేకుండా వాహనాలు (ఆటో) నడిపితే సెక్షన్ 177 ప్రకారం మొదటి సారి రూ.150, రెండోసారి రూ.300.
- సీటు బెల్టు ధరించకుండా వాహనం (కార్లు) నడిపితే సెక్షన్ 194బి(1) ప్రకారం నడిపిన వ్యక్తికి రూ.వెయ్యి, డ్రైవర్ పక్కన కూర్చున్న ప్రయాణికుడికి రూ. వెయ్యి జరిమానా.
- వాహనం రిజిస్ట్రేషన్ లేకుండా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించకుండా వాహనాన్ని నడిపితే సెక్షన్ 192 ప్రకారం మొదటి సారి రూ.2 వేలు, రెండోసారి రూ.5 వేల జరిమానా.
- అతి వేగంగా వాహనం నడిపితే సెక్షన్ 183ఒ ప్రకారం రూ. వెయ్యి జరిమానా.
- ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తే (ట్రిపుల్ రైడింగ్) సెక్షన్ 194సి ప్రకారం వెయ్యి రూపాయలు జరిమానా.
- రేసింగ్, వేగంగా వాహనం నడిపితే సెక్షన్ 189 ప్రకారం మొదటిసారి రూ.5 ఐదు వేలు, రెండోసారి కూడా పట్టుబడితే రూ. 10 వేల జరిమానా చెల్లించాల్సిందే.

# వాహనాలకు తుప్పు

» పోలీస్‌స్టేషన్లలో గుట్టలుగా పడివున్న ద్విచక్ర వాహనాలు

» ఏళ్ల తరబడి వదిలేస్తున్నారు

» వినియోగానికి పనికిరావు

» వాహన పార్ట్‌లు మాయం!




తాడేపల్లిగూడెం క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు పోలీస్ స్టేషన్ల ఆవరణలో తుప్పు పట్టి పోతున్నాయి. సకాలంలో సంబంధిత కేసులు పరిశీలించి వాహనాలు సొంతదార్లకు అప్పగించవచ్చు. అలాంటి అవకాశం లేని వాహనాలను ఆరునెలల లోపు వేలం వేయగలిగితే కనీసం ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో తుప్పు పట్టి పోతున్నా వాహనాలు పాత ఇనుప దుకాణాలకు విక్రయించాల్సిందే. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలతో పాటు వివరాలు లభ్యం కాని వాహనాలు ప్రతీ స్టేషన్‌లో సుమారు 50 నుంచి 100 వరకు ఉంటాయని అంచనా.

### మాయమవుతున్న విడిభాగాలు!

ద్విచక్ర వాహనాలు ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్ల వద్ద మగ్గిపోతుండడంతో విడి భాగాలు మాయమవుతున్నాయి. సిబ్బందికి కావలసినవి తీసేసుకుంటున్నారని, కొందరు దుండగులు తీసుకుపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్ట్‌లు లేని, తుప్పు పట్టిన వాహనాలు వేలం వేసినా కనిష్ఠ ధర వస్తోంది.

### నిబంధనలు పట్టించుకోరా..?

నిబంధనలు అతిక్రమించిన వాహనాలు పోలీసులు పట్టుకుంటారు. వాటిని ఏమి చేయాలనే నిబంధనలు మాత్రం పోలీసులు పాటించరు. వివిధ సందర్భాలలో సీజ్ చేసిన వాహనాలు పోలీస్ స్టేషన్‌కు తరలించిన తర్వాత రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయాలి. వివరాలు లభ్యం కాని వాహనాలను ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం వేయాలి. ఇలా ఎక్కడా జరగడం లేదు. నిర్ణీత సమయం లోపు వేలం ద్వారా విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. సీజ్ చేసిన వాహనాలను ఎండకు వానకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో వదిలేస్తున్నారు.

### పాత ఇనప దుకాణాలా..!

జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల ఆవరణ పాత ఇనుప సామగ్రి దుకాణాలను తలపిస్తున్నాయి. ఏ స్టేషన్ ఆవరణ చూసినా సీజ్ చేసిన వాహనాలు దర్శనమిస్తాయి. దీంతో ఆ ప్రాంతం తుప్పు పట్టి, దుమ్ము కొట్టుకుపోయిన వాహనాలతో పాత ఇనుప సామగ్రి దుకాణంలా మారాయి. చూసేవారికి అది భయంగొలిపే ప్రదేశంగా కనబడితే పాములు, పురుగులకు నిలయంగా మారి పోలీస్ సిబ్బందికి సైతం ప్రమాదకర పరిస్థితి నెలకొంది.

**ప్రమాదాలు కావచ్చు.. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ పట్టుబడిన వాహనాలు కావచ్చు.. పేకాట, కోడిపందేలు, గుండాటపై దాడుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు కావచ్చు.. ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్లలో ఉంటాయి. ఆయా వాహనాల కేసులు ఏమిటి.. సొంతదారులు ఎవరు.. వాటిని ఏం చేయాలి.. తేలక అలాగే ఉండి పోతున్నాయి. వందల వాహనాలు తుప్పుపట్టి పోతున్నాయి. అంతకంటే ముందే కొన్ని వాహనాల విడిభాగాలు మాయం అవుతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలో ఇదే తీరు..!**

### రెండేళ్ల క్రితం వేలం..

పోలీస్‌స్టేషన్లలో మోటారు సైకిల్స్, వాహనాలు వేలం వేసి రెండేళ్లు గడిచిందని లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లలో పదుల సంఖ్యలో మోటారు సైకిల్స్ తుప్పుపట్టిపోతున్నాయి. వినియోగానికి అనువుగా ఉన్న వాహనాలు సైతం పనికిరాకుండా పోతున్నాయి.

## స్పా సెంటర్ కేసులో మరో నిందితుడి అరెస్టు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్పా మసాజ్ సెంటర్ పేరుతో వ్యభిచారం నిర్వహించడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు ఈనెల 11న దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈకేసులో ఐదో నిందితుడైన మద్దు నరేంద్రబాబు అలియాస్ నరేంద్రను శుక్రవారం అరెస్టు చేశారు. ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి కింద ఆర్‌ఆర్‌పేట రోడ్డులో ఒక భవనంలో ఎస్‌ఎస్ బ్యూటీ యూనిసెక్స్ సెలూన్ అండ్ స్పా మసాజ్ పేరుతో నమ్మిన నాగార్జున అతని భార్య శివదుర్గ నిర్వహిస్తున్నారు. బ్యూటీషియన్ శిక్షణ పేరుతో వివిధ ప్రాంతాల నుంచి కొంతమంది యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారని, క్రాస్ మసాజ్ చేయిస్తున్నారని డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు ఈనెల 11న సమాచారం అందింది. అదేరోజు రాత్రి టూటౌన్ సీఐ వైవిరమణ, ఎస్ఐ నాగకల్యాణి, తన సిబ్బం దితో దాడి చేశారు. నమ్మిన నాగార్జునతోపాటు అతని భార్య శివదుర్గ మరో మహిళ ఉర్ల దివ్యను అరెస్టు చేశారు. ఏలూరు పత్తేబాదనకు చెందిన నిడదవోలు భాను ప్రసాద్ అలియాస్ భాను, ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన మద్దు నరేంద్రబాబు అలియాస్ నరేంద్రపై కేసు నమోదు చేశారు. భానుప్రసాద్, నరేంద్రబాబు పరారీలో ఉన్నారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరారీలో ఉన్న ఐదో నిందితుడు మద్దు నరేంద్రబాబును శుక్రవారం అరెస్టు చేశారు.

## బైక్‌పై బస్సును దాటుతూ.. యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు కాలేజీ బస్సును ఓవర్‌టేక్ చేయబోతుండగా ఎదురుగా మరో బస్సు వచ్చింది. కంగారుపడి సడెన్ బ్రేక్ వేయడంతో పడిపోయాడు. అతడి తలపై బస్సు చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరులోని సత్రంపాడు ఎన్టీఆర్ బొమ్మ సమీపంలో నివాసం ఉంటున్న మెండెం రత్నకుమార్ ఎలక్ట్రికల్ పనులు చేస్తాడు. శుక్రవారం మధ్యాహ్నం వట్లూరువైపు స్కూటర్‌పై వెళుతుండగా మార్గమధ్యలో ప్రభుత్వ ఐటీఐ దగ్గర సత్రంపాడు నుంచి వట్లూరు వెళుతున్న కళాశాల బస్సును ఓవర్ టేక్ చేస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా మరో బస్సు రావడంతో కంగారుపడి బ్రేకులు వేయడంతో పడిపోయారు. రత్నకుమార్, వెనుక కూర్చున్న స్నేహితుడు పడిపోయారు. బస్సు చక్రం అతని రత్నకుమార్ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రత్నకుమార్‌ను వెంటనే 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పుట్టినరోజు నాడే మృత్యువు కబళించింది

ఉంగుటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు సందర్భంగా బిర్యానీ ప్యాకెట్ తీసుకెళుతున్న యువకుడిని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం పూళ్ళ గ్రామానికి చెందిన చేబత్తిన తులసీ రాం(17) నారాయణపురంలో ఐస్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధి నిర్వహణ అనంతరం పుట్టిన రోజు కావడంతో బిర్యానీ పార్సిల్‌తో ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. కైకరం బీసీ కాలనీ దాటిన తర్వాత ఏలూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తులసీరాం అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి అంజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. శుక్రవారం తులసీరాం మృతదేహానికి పంచానామా జరిపి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు

### మొక్కజొన్న ప్యాకింగ్ మిషన్‌లో పడి..

లింగపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి: సీడ్ మొక్కజొన్న ప్యాకింగ్ గరాటులో విత్తనాలు ప్యాక్ చేస్తూ ప్రమాదవశాత్తూ మెషీన్‌లో పడి యువకుడు మృతి చెందాడు. బీహార్‌కు చెందిన 30 మంది కూలీలు రంగాపురంలోని మొక్కజొన్న కంపెనీలో పని చేయడానికి ఈనెల 13న వచ్చారు. సుపేష్‌కుమార్ విత్తనాలు ప్యాక్‌చేస్తూ విత్తనాలున్న గరాటులో పడిపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని సోదరుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.



## మధ్యాహ్న భోజనం మెనూ మారింది

**నేటి నుంచి అమలు**

పెనుమంట్ర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ మారింది. శనివారం నుంచి కొత్త మెనూ అమలుచేయాలని పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యాహ్న భోజనం పకడ్బందీగా అమలు చేయడంలో ఎంఈవోలు బాధ్యత వహించాలి. పాఠశాల హెచ్ఎంలకు డీఈవో సూచనలు చేశారు. జోన్‌ల వారీగా ఆ ప్రాంతంలో విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ కోరిన ప్రకారం కొత్త మెనూ ప్రకటించారు. జోన్ 2 పరిధిలోని పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో మెనూ ఇలా ఉంది.

**కొత్త మెనూ..**

- **సోమవారం** వైట్ రైస్, ఆకు కూర పప్పు, ఫ్రైడ్ ఎగ్, చిక్కి.
- **మంగళవారం** లెమన్ రైస్ లేదా టమోటా రైస్, బాయిల్డ్ ఎగ్, రాగి జావ, చెట్నీ.
- **బుధవారం** వైట్ రైస్, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, ఫ్రైడ్ ఎగ్.
- **గురువారం** వెజిటబుల్ రైస్ లేదా పలావ్, ఆలూ కుర్మా, బాయిల్డ్ ఎగ్, రాగి జావ.
- **శుక్రవారం** వైట్ రైస్, పప్పు, ఆకు కూరలు, ఫ్రైడ్ ఎగ్, చిక్కి.
- **శనివారం** వైట్ రైస్, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, ఫ్రైడ్ ఎగ్, చిక్కి.

## పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని తండ్రి, సవతి తల్లి ఏదోచేసి ఉంటారని బాలిక అమ్మమ్మ ఆరోపించారు.

దెందులూరు మండలం గాలాయిగూడెం గ్రామానికి చెందిన ఉప్పటి ఆశీర్వాదంకు పెదవేగి మండలం కూచింపూడికి చెందిన గురిందపల్లి అనితతో వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. 16 ఏళ్ల క్రితం అనిత మరణించింది. ఆమె మరణంపై అప్పట్లో అనుమానాలు ఉన్నాయని, ఆశీర్వాదంపై కేసు పెడితే జైలుకు వెళితే పిల్లలను ఎవరు చూస్తారని అనడంతో మిన్నకుండిపోయినట్లు పెదవేగి మండలం కూచింపూడికి చెందిన బాలిక అమ్మమ్మ గురిందపల్లి పుల్లమ్మ తెలిపారు. ఆ తరువాత ఆశీర్వాదం ఆదమ్మను వివాహం చేసుకున్నాడు. అనిత కుమార్తె గాయత్రి ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. ఫిబ్రవరి 27న రాత్రి గాయత్రి ఇంట్లో ఉరి వేసుకుందని, ఆదమ్మ, మరికొంతమంది గమనించి ఉరి నుంచి కిందికి దించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి విజయవాడకు రిఫర్ చేశారు. ఆసుపత్రికి చేరుకున్న అమ్మమ్మ పుల్లమ్మ పలు ఆరోపణలు చేశారు. తన మనుమరాలు గాయత్రి అంత పిరికిది కాదని తన అల్లుడు, సవతి తల్లి ఏదో చేసి ఉంటారని ఆరోపించారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలన్నారు. ఆ నాడు నోరు మూసుకుని ఉండడంతోనే తన కుమార్తె ప్రాణాలు ఎలా పోయాయో ఇప్పటికి తెలియదని, జ్వరం వచ్చి ప్రాణాలు పోయాయని చెప్పారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పుడు తన మనమరాలు పరిస్థితి ఏమవుతుందోని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులను వేడుకుంది.

### తల్లి, కుమారుడు అదృశ్యం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒక తల్లి తన కుమారుడిని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెళ్లిపోయిన మహిళ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు శాంతినగర్ 7వ రోడ్డులో నివాసం ఉంటున్న ఉత్తరవెల్లి మణి (20), కుమారుడు మోక్షసాయి (2) ఈనెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఉత్తరవెల్లి మణి తల్లి అలజంగి కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : దోమల నిర్మూలన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం జేపీ కాలనీ, వెంకన్నచెర్వు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వేలకు స్థానికులు సహకరించాలని, వాస్తవ సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి నీలిమ, సిబ్బంది పాల్గొన్నారు.

## మత సామరస్య దేవాలయ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ ఆవరణలో హిందూ ముస్లిం క్రైస్తవ మత సామరస్య దేవాలయం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు జరిపారు. పెద్ద సంఖ్యలో వైద్యశాఖ అధికార ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. క్రీస్తు, అల్లా, హిందూ దేవుళ్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

## భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం



ఏలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు శుక్రవారం స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పునూతల పుల్లారావు, ఆలయ ప్రధాన అర్చకులు కాళ్ళకూరి రవికుమార్ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వేగి లింగేశ్వరుడి గ్రామోత్సవం

చింతలపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : వేగి లింగేశ్వరస్వామి పార్వతీదేవి విగ్రహాలతో శుక్రవారం గ్రామోత్సవం నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఊరేగిస్తూ కళ్యాణం జరిగిన తలంబ్రాలను భక్తులకు అందించారు. ఈ ఊరేగింపులో కళాకారులతో ప్రదర్శనలు జరిగాయి.

## ఎమ్మెల్యే చింతమనేని పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని పురాతన శివాలయంలో ప్రతిరోజు స్వామికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు.

## టైలర్స్ డే ర్యాలీ



కొయ్యలగూడెంలో కేకు కట్ చేసి టైలర్స్ డే వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వీరభద్ర టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్‌డే నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు నోముల రాంప్రసాద్, రెబ్బా కనకరాజు, కరిని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** ఉంగుటూరు చల్లాలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నాడు కుట్టు మిషన్ రూప శిల్పి విలియం హో జయంతిని పురస్కరించుకుని టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి టైలర్లు నివాళులర్పించారు.సంఘ నాయకులు ముప్పన సత్యనారాయణ,సారిక చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం:** స్థానిక గణపతి ఆలయం వద్ద విలియం హో గణపతి రామ టైలర్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు అంజనేయరాజు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, సూర్యచంద్రం, ముప్పిడి చినబాబు, ఉపసర్పంచ్ సంకు కొండ, టైలర్స్ వెంకటరమణ, చెప్పుల మధు, సంకు కృష్ణ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు/కామవరపుకోట/చింతలపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐఓ కె.యోహాను తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో 3548 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆయన తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కామవరపుకోట శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 263 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు అధికారులు తెలిపారు. ఇందుకోసం 13 గదులను, 13 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం, మంచినీటి సౌకర్యం, పోలీసు రక్షణ ఏర్పాటు చేశారు. చింతలపూడి కేంద్రంగా మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సర ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు మొత్తం 764 మంది హాజరుకానున్నారని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 243 మంది, హయగ్రీవ కళాశాలలో 232, అర్పణ కళాశాలలో 289 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు అధికారులు తెలిపారు.

## పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

టి.నరసాపురం/కొయ్యలగూడెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి కె.కోటేశ్వరరావు సూచించారు. స్థానిక పశువైద్యశాల వద్ద శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో పశువులకు మార్చి 1వ తేదీ నుంచి 31 వరకు గాలికుంటు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. గాలికుంటు టీకాలు వల్ల పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుదలను నివారించవచ్చని తెలిపారు. దూడల్లో మరణాలు తగ్గుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎఫ్ఎండీ టీకా కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కొయ్యలగూడెం మండల పశువైద్యాధికారి బీఆర్.శ్రీనివాసన్ కోరారు. ఈ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువైద్య శిబిరాల వద్ద ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## గ్రేడింగ్ సమస్యకు పరిష్కారం దిశగా చర్చలు

పెదవేగి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ గెలల గ్రేడింగ్‌లో తలెత్తిన సమస్యకు పరిష్కారం దిశగా చర్చలు సాగాయి. ఆయిల్‌పామ్ గెలల గ్రేడింగ్ పేరుతో గెలల ఏరివేత ఎక్కువైందని, దీంతో నష్టాలను చవిచూస్తున్నామని రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన బాట పట్టారు. దీనిపై స్పందించిన ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులను చర్చలకు ఆహ్వానించారు. దీంతో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు- యాజమాన్యం మధ్య శుక్రవారం చర్చలు సాగాయి. ప్రధానంగా ఎదుర్కొంటున్న గ్రేడింగ్ సమస్యను పరిష్కరించాలని, అడ్డగోలుగా చేస్తున్న గెలల ఏరివేతను నిలుపుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గెలల గ్రేడింగ్ విషయంలో సానుకూలంగా స్పందించిన ఫ్యాక్టరీ యాజమాన్యం గెలల ఏరివేత సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గెలల కోతపై శిక్షణ కార్యక్రమాలు చేపట్టి, కోత సమయంలోనే పక్వానికి వచ్చిన గెలలను దించేలా జాగ్రత్తలు తీసుకుంటామని ఫ్యాక్టరీ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. జిల్లాలోని నవభారత్ సంస్థ 19.47శాతం ఆయిల్ రికవరీ ప్రకారం ధరను చెల్లిస్తుందని, ఆ మేరకు అన్ని చోట్లా ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు: కలెక్టర్



ఏలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌కు వివరించారు. ఏపీ సచివాలయం నుంచి సీఎస్ జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించి పలు అంశాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో కలెక్టర్, జేసీ ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ తాగునీటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, వేసవి కార్యాచరణ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. నగరంలోను తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఏలూరు కమిషనర్ భాను ప్రతాప్‌కు సూచించారు. కాల్వల నుంచి తాగునీటి అవసరాల కోసం విడుదలయ్యే నీరు అక్రమంగా మళ్లకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వి విశ్వేశ్వర రావు, జెడ్పీ సీఈవో కె సుబ్బారావు, సీపీవో సీహెచ్ వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

# విద్యా సంస్థల్లో జాతీయ సైన్స్ దినోత్సవం

### సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు.. ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

కామవరపుకోట/నిడమర్రు/ఉంగుటూరు/టి.నరసాపురం/ఏలూరు అర్బన్/పెదపాడు/భీమడోలు/చింతలపూడి/లింగపాలెం/పెదవేగి//, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.విజయబాబు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పత్తేపురం ఉన్నత పాఠశాలలో సైన్స్ నమూనాల ప్రదర్శన నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్ కొండయ్య ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు. పత్తేపురం గ్రామ ఉపసర్పంచ్ రుద్రరాజు, కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి భాస్కర్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కైకరం హైస్కూలులో రిటైర్డ్ శాస్త్రవేత్త యాళ్ళ శివ ప్రసాదరావు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ళ ప్రసాదరావు అధ్యక్షత వహించారు. మక్కినవారిగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సి.వి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం ఎల్.వెంకటేశ్వరరావు, శరత్‌బాబు, రాములు, వాసు, సుమతీ రత్నం తదితరులు పాల్గొన్నారు. ఏలూరు సూర్య హైస్కూలులో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోలో డైరెక్టర్ కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను సర్ సి.వి.రామన్ కనుగొన్న రోజును పురస్కరించుకుని నిర్వహించే సైన్స్ దినోత్సవం ప్రత్యేకతలను వివరించారు. విద్యార్థులు తయారుచేసిన 250 వివిధ రకాల సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డానియేల్, హెచ్ఎం దుర్గారావు, ప్రసన్న, లలిత పాల్గొన్నారు.

పెదపాడు హైస్కూల్‌లో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు, విద్యాకమిటీ ఛైర్మన్ వడ్డాది సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అప్పనవీడు హైస్కూల్‌లో హెచ్.ఎం. తోట పుష్పవతి అధ్యక్షతన జాతీయ సైన్స్ డే వేడుకలు జరిగాయి. భీమడోలు మండలం జెఎంఎంపురం, కోడూరుపాడు గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. జెఎంఎంపురం పాఠశాలలో హెచ్ఎం నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. చింతలపూడిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ బాలికల హైస్కూలులో విద్యార్థినులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

లింగపాలెంలో సైన్స్ నమూనాలు ఆకర్షించాయి. విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కే శ్రీనివాసరావు, సీహెచ్ రత్నాకర్, సాయిసునంద, ప్రసాద్, ఉమామహేశ్వరరావు, కవిత, జయలక్ష్మి పాల్గొన్నారు. విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ అన్నారు. పెదవేగి మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఉపకరణాలను ప్రదర్శించారు.

### సైన్సు దినోత్సవ పోటీల జిల్లా విజేతలు వీరే

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో నిర్వహించిన క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల విజేతలతో జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. పోస్టర్ ప్రజంటేషన్ పోటీ జూనియర్స్ విభాగంలో కస్తూరిబా బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఒ.పద్మశ్రీ, సెయింట్ థెరిస్సా హైస్కూలు విద్యార్థిని జె.హర్షిత, కొవ్వలి జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఏ.ఏంజెల్, సీనియర్స్ విభాగంలో ఎం.సురవరం జడ్పీ హైస్కూలు విద్యార్థిని జి.నమ్రత, కొవ్వలి జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఏ.దుర్గ, సత్యవోలు జడ్పీ హైస్కూలు విద్యార్థి టి.జీవన్‌కుమార్ తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచారు. క్విజ్ పోటీ జూనియర్స్ విభాగంలో దెందులూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎస్.ఎన్.వి.మణికంఠ, ఇంగిలిపాక లంక జడ్పీహెచ్ఎస్ విద్యార్థి పి.జశ్వంత్, ఆటపాక ప్రభుత్వ హైస్కూలు విద్యార్థిని బి.సునీలశ్రీ, సీనియర్స్ విభాగంలో శనివారపుపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఏ.నవీన్, కొవ్వలి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పి.నాగదివ్య, ఏలూరు కస్తూరిబా బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పి.మహాలక్ష్మి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరందరికీ పద్మశ్రీ పురస్కారగ్రహీత ఏ.నాగేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్ నగదు బహుమతులను అందజేశారు. స్కూలు హెచ్ఎం కుటుంబరావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.వి.ఎస్.సోమయాజులు, వేల్పుచర్ల స్కూలు హెచ్ఎం శ్రీనివాస్, తదతరులు పాల్గొన్నారు.



లింగపాలెంలో విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు



జిల్లాస్థాయి విజేతలతో పద్మశ్రీ అవార్డు గ్రహీత నాగేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, తదితరులు

## అంబులెన్సు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



భీమడోలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అతి వేగంతో ప్రయాణి స్తున్న అంబులెన్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన ఘటనలో అంబులెన్సులో ప్రయాణిస్తున్న రోగితో పాటు అతని బంధువుకి గాయాలైన సంఘటన భీమడోలు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం జరిగింది. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రోగిని తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ తరలిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో రోగి పిల్లి వీరాస్వామి, బంధువు ఉదయకుమారికి గాయాలు అయ్యాయి. డ్రైవర్‌కి గాయాలయ్యాయి. సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వాహనం ఢీకొని బ్యాంకు మేనేజర్‌కు గాయాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నడిచివెళ్తున్న బ్యాంకు మేనేజర్‌ను గుర్తు తెలియని కారు ఢీకొని వెళ్ళిపోవడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. బీహార్‌కు చెందిన సర్వోత్తమ సింగ్ (40) ఏలూరు ఎన్ఆర్ పేటలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన శనివారపుపేటలో ఒక రూమ్ తీసుకుని ఉంటున్నారు. గురువారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఒక హోటల్‌లో భోజనం చేసి నడిచి ఇంటికి వెళ్తుండగా శనివారపుపేట గాలిగోపురం సమీపంలో ఒక కారు వెనుక నుంచి ఢీకొని వెళ్ళిపోయింది. ఈప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన సింగ్‌ను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈసంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేయడంతో త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతర ఏర్పాట్ల పరిశీలన

భీమడోలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భీమడోలులో జరుగుతున్న జాతర ఏర్పాట్లను భీమడోలు సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్ పరిశీలించారు. 8,9 తేదీల్లో నిర్వహించే జాతర ఊరేగింపు ముఖ్య ఘట్టాలకు సంబంధించి చర్చించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై జాతర కమిటీతో చర్చించారు.

## ఎమ్మార్పీఎస్ అమరవీరుల సంస్మరణ సభలు

టి.నరసాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):అమరవీరుల సంస్మరణ సభలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్దు మాదిగ పిలుపునిచ్చారు. మక్కినవారిగూడెంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం దిరిసిరపు విజయ్ మాదిగ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దు మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహిస్తామని తెలిపారు.

## 12 మంది పందెం రాయుళ్ల అరెస్ట్

పెదపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : తోటగూడెం వద్ద 12 మంది పందెంరాయుళ్లను అరెస్ట్ చేసినట్లుగా పెదపాడు ఎస్ఐ కట్టా శారద సతీశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,960 నగదు, రెండు కోడికత్తులు, మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## రాంబాబుకు ఉద్యోగ విరమణ సత్కారం



ఏలూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో పనిచేసి సమాచార శాఖకు ఏవీ సూపర్ వైజర్ చినగంధం రాంబాబు అందించిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర పౌరసంబంధాలశాఖ అదనపు సంచాలకులు ఎల్ స్వర్ణలత అన్నారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ హాల్లో రాంబాబు ఉద్యోగ విరమణ సన్మాన సభ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్వర్ణలత, జిల్లా పౌరసంబంధాల అధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయులు, పాత్రికేయులు పాల్గొని సత్కరించారు.

## టీచరు విజయ కుమారి..

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కండ్రిక గూడెం ఎంపీయూపీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ టీచరుగా పనిచేస్తున్న డి.విజయకుమారి ఉద్యోగ విరమణ సభ శుక్రవారం సాయంత్రం స్కూలు ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా విజయకుమారిని సన్మానించారు. ఎంఈవో ఎస్.నరసింహమూర్తి, ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్, స్కూలు హెచ్ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

## నాగేంద్రకు ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త అవార్డు



ఏలూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):ఏలూరులో విస్తరణ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న ఎస్.నాగేంద్రబాబు ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్తగా ఎంపిక అయ్యారు. శుక్రవారం అంతర్జాతీయ న్యూ ట్రెంట్ సదస్సులో భాగంగా బాయ్‌గురుదాస్ గ్రూప్‌ఆఫ్ ఇనిస్టిట్యూషన్ పంజాబ్ ఏరువాక కేంద్రం నుంచి ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు.

## బడ్జెట్‌పై భిన్న స్వరాలు

### విజన్-2047 దిశగా రాష్ట్ర బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సీఎం చంద్రబాబు విజన్-2047కి అద్దంపట్టేలా ఉంది. అన్ని వర్గాలకు ప్రాధాన్యతకల్పించి వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక నిధులు కేటాయించారు. తద్వారా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బడ్జెట్ తోడ్పడేలా ఉంది.

- ఘంటా మురళీ, మాజీ ఎమ్మెల్యే

### బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం



బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించేదిగా ఉంది. తల్లికి వందనం అమలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత నిచ్చారు. బీసీల సంక్షేమానికి రూ.47వేల కోట్లు కేటాయించి మరోసారి బీసీలపై తమకున్న చిత్తశుద్ధిని ప్రభుత్వం నిరూపించుకున్నది.

- కె.బుజ్జి యాదవ్, బీసీ సెల్ కార్యదర్శి

### రాష్ట్రాభివృద్ధికి బడ్జెట్ దోహదం



బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. సీఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చారు. రైతులకు, బడుగుబలహీన వర్గాలను సంతృప్తి పరిచే విధంగా ఈ బడ్జెట్ ఉన్నది.

- పారేపల్లి రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్

### ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా..



ప్రజల ఆకాంక్షలకు బడ్జెట్ అద్దంపట్టేలా ఉంది. అభివృద్ధి ఫలాలు అందరికి అందేలా కేటాయింపులు జరిగాయి. వ్యవసాయ రంగానికి ఊపిరి పోస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు నిధులు కేటాయించటం హర్షణీయం

- రెడ్డి అప్పలనాయుడు, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్

### ఏపీకి అండగా కేంద్రం



ఎన్నికల మేనిఫెస్టో హామీల అమలు లక్ష్యంగా కేటాయింపులు జరిగాయి. కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చు చేయాలి. కేంద్రం ఎప్పుడు రాష్ట్రానికి అండగా ఉంటుంది. ఆశించిన స్థాయిలో రాష్ట్రంలో నిధులు లేకున్నా ధైర్యంతో బడ్జెట్ రూపొందించటం అభినందనీయం.

- అంబికా కృష్ణ, మాజీ ఎమ్మెల్యే

### ఉద్యోగుల ఊసులేకపోవడం బాధాకరం



బడ్జెట్‌లో పీఆర్సీపై ప్రకటన చేస్తే ఉద్యోగ వర్గాలు సంతోష పడేవి. ఉద్యోగులకు సంబంధించి ఊసులేకపోవడం బాధాకరం. పథకాలను అమలు చేసే ఉద్యోగులకు సప్లిమెంట్ బడ్జెట్‌ను అయినా ఇస్తే బాగుండేది.

- చోడగిరి శ్రీనివాస్, ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు



### ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు హర్షణీయం: కరాటం

ఏలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు బడ్జెట్‌లో రూ.400 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.6705 కోట్లు కేటాయించి రైతుల చిరకాల కోరిక నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేయడం హర్షణీయమని మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి కూటమి ప్రభుత్వంలో మంచి రోజులు రాబోతున్నాయన్నారు. ఇరిగేషన్‌కు రూ.18 వేల కోట్లు బడ్జెట్ పెట్టడం అభినందనీయమన్నారు. రానున్న రెండేళ్లలో పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకాలు పూర్తవుతున్నాయన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు సూపర్ సిక్స్ పథకాలు అమలయ్యేవిధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు, జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, కొయ్యలగూడెం జనసేన ఉపాధ్యక్షుడు కసుకుర్తి ఉమా, కొప్పిర్ల నాగరాజు పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్కూల్స్‌కు మాత్రమే తల్లికి వందనం ఇవ్వాలి

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామని ప్రకటించడం హర్షణీయం. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నప్పటికీ లెక్క చేయకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ ఏపీఈఆర్‌సీ ఇచ్చిన తీర్పును సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన ఏపీ ప్రభుత్వ నియంత్రణ మండలి రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తుగా మారిపోయిందన్నారు.

## అన్నసమారాధన

టి.నరసాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన అఖండ అన్న సమారాధనను జడ్పీటీసీ సభ్యుడు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు పసుమర్తి రాము, పర్వతనేని మురళీ పర్యవేక్షించారు.

## కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 28: (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గిరిజన చట్టాల్ని రద్దు పరుస్తుందని ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తిప్పికొట్టారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం గిరిజన చట్టాల్ని అమలు పరిచేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గిరిజన చట్టాల్ని రద్దు చేయటం ఎవరి వల్ల కాదన్నారు. మండల జనసేన అధ్యక్షులు పసుపులేటి రాము, గిరిజన నాయకులు ఉన్నారు.

**ఏజెన్సీ ప్రాంతంలో 72 శాతం ఓటింగ్**

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలో 72శాతం ఓటింగ్ నమోదు కావటం ఇదే ప్రథమం అని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయం సాధిస్తారని అన్నారు.

## శ్రీవారికి సేవ పూర్వజన్మ సుకృతం



పదవీ విరమణ చేసిన పండితునికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందచేస్తున్న ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సన్నిధిలో సేవచేసి పదవీ విరమణ పొందడం పూర్వజన్మ సుకృతమని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి అన్నారు. శ్రీవారి దేవస్థానంలో యజుర్వేద పండితుడు తూట్లగుంట లక్ష్మీనారాయణ అవధాని శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

## సమస్యల పరిష్కారానికి పార్టీల మద్దతు అవసరం

ఏలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి అఖిలపక్షాల మద్దతు ఎంతో అవసరమని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా అధ్యక్షుడు కూనపాముల విఘ్నేష్ అన్నారు. శుక్రవారం గౌడ కమ్యూనిటీ హాలులో అఖిలపక్ష నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య హామీ ఇచ్చినట్లు విఘ్నేష్ తెలిపారు. కౌన్సిలర్ వలవల తాతాజీ, పట్టణ వైసీపీ జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాస్, అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కాంగ్రెస్ పార్టీకి చెందిన మద్దాల ప్రసాద్, కమ్యూనిస్టు నాయకులు పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించాలి



ఆదాయపు పన్ను శాఖ అధికారిని సత్కరిస్తున్న వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పన్ను చెల్లించాలని విశాఖపట్నం ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదాయపన్ను చెల్లింపుదారులకు అడ్వాన్స్ ట్యాక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వివాద్‌సేవిశ్వాస్ పథకాన్ని తీసుకువచ్చా రన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకం వల్ల ఆదాయపన్నుకు చెందిన వడ్డీలు, పెనాల్టీలు, శిక్షలు మాఫీ అవుతాయన్నారు. అడ్వాన్స్ ట్యాక్స్ పన్ను చెల్లింపుదారులు వారి వార్షిక ఆదాయంపై చెల్లించాల్సిన ఆదాయపు పన్ను నాలుగువిడతల్లో చెల్లించవచ్చన్నారు. అడిషనల్ కమిషనర్ డి.హేమభూపాల్ ఆదాయపన్నుశాఖ అధికారులు ఎన్.శ్రీనివాసరావు, రిటైర్డ్ జాయింట్ కమిషనర్ చాగంటి సంజీవ్, వాణిజ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దళిత సంఘాల ధర్నా

ఏలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం రెడ్డిపేట ప్రాథమిక పాఠశాలల హెచ్ఎం సుబ్రహ్మణ్యంపై అదే పాఠశాలలో పనిచేసే అగ్రవర్ణాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు అసత్య ఆరోపణలు చేశారని దళిత సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టి ఆయన సస్పెండ్ అయ్యేంతవరకు తీసుకువచ్చారని పలువురు ఉపాధ్యాయులు, దళిత సంఘాల నాయకులు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ముదినేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కోమర్రులో రొయ్యల చెరువుపై విద్యుదాఘాతానికి గురై గ్రామానికి చెందిన తిరుమలశెట్టి రామకృష్ణ (39) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గురువారం సాయంత్రం తన రొయ్యల చెరువు గట్టుపై ఏరియేటర్‌ను ఆన్ చేసేందుకు స్విచ్ వేయగా షాక్‌కు గురై రామకృష్ణ మృతిచెందాడు. అతని తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.ఎస్.వీరభద్రరావు తెలిపారు.



అబ్దుల్‌మజీద్ మార్కెట్ కూల్చివేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

## మార్కెట్ దుకాణాల కూల్చివేతపై విజిలెన్స్ విచారణ

కైకలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో కైకలూరు కోరుకొల్లు రోడ్డు సెంటర్లోని అబ్దుల్ మజీద్ మార్కెట్ కూల్చివేతపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం విచారణ చేశారు. కోరుకొల్లు రోడ్డు సెంటర్లో గతంలో షాపులు ఎప్పుడు కూల్చింది, జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అంశాలను తెలుసుకున్నారు. సర్వే అధికారులతో సర్వే నిర్వహించి, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ సరిహద్దులను నిర్ధారించుకున్నారు. 2023 నవంబరు 5న అబ్దుల్ మజీద్ మార్కెట్ కూల్చివేయడం అనంతరం పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై ఆరా తీశారు. పలువురు చేసిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. విజిలెన్స్ డీఈ శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ శిరీష, మండల పరిషత్ ఏవో ప్రకాశరావు, ఈవోపీఆర్డీ కొండలరావు, కార్యదర్శి ఆనంద భూషణం, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

## అమరావతి తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా వైష్ణవి నియామకం

### గుర్తింపు పత్రాన్ని అందజేసి అభినందించిన సీఎం చంద్రబాబు

ముదినేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని, సమాజ సేవకురాలు అంబుల వైష్ణవి నియమితులయ్యారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా వైష్ణవికి నియామక పత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి శుక్రవారం ఆహ్వానం రావడంతో వైష్ణవి తండ్రి మనోజ్‌తో వెళ్లి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. అమరావతి క్యాపిటల్ సిటీ ఔన్నత్యాన్ని కాపాడేందుకు, బ్రాండ్ అంబాసిడర్ విధులు, బాధ్యతలను నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఈ విధులతో పాటు వైద్య విద్యను కొనసాగించాలని వైష్ణవికి చంద్రబాబు సూచించారు. వైష్ణవి తండ్రి మనోజ్‌ను అభినందించారు.



అమరావతి తొలి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవిని, ఆమె తండ్రి డాక్టర్ మనోజ్‌ను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

### భూములు అమ్మి విరాళం

వైష్ణవి చిన్నతనం నుంచి తోటి విద్యార్థులకు తన తండ్రి ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ మనోజ్ సహకారంతో పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించటమే కాక, పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. 2018లోనే ఆమె అమరావతి నిర్మాణానికి, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.14 లక్షలు విరాళం ఇవ్వగా అప్పట్లోనే వైష్ణవిని సీఎం చంద్రబాబు అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. 2024లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే గతేడాది జూన్‌లో ఎకరం భూమి, బంగారపు గాజులు అమ్మి వైష్ణవి రూ.26 లక్షలు అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, అనంతరం అర ఎకరం భూమి అమ్మి రూ.13లక్షలు రాష్ట్ర కొత్త సచివాలయ భవనాల నిర్మాణానికి సీఎం చంద్రబాబుకు అందజేశారు. వైష్ణవికి అమరావతిపై ఉన్న మక్కువకు స్పందించిన చంద్రబాబు తిరిగి ఆమెను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు.





కైకలూరులో విలియం హోం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దర్జీలు.. చిన్నంపేటలో టైలర్స్ డే

## 'టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి'

కైకలూరు/ముదినేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కైకలూరు దర్జీదారుల సంఘం నూతన అధ్యక్షుడు ఎండీ జానీ కోరారు. శుక్రవారం టైలర్స్‌డే కైకలూరులో ఘనంగా నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎండీ జానీ, ఉపాధ్యక్షురాలిగా ముంగర మయూరి, కార్యదర్శి టి.శంకర్, ట్రెజరర్ గూడవల్లి గోపి, జాయింట్ సెక్రటరీ రెడ్డి ముసలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదినేపల్లి మండలం ముదినేపల్లిలో టైలర్స్‌డే జెండాను ఆవిష్కరించి టైలర్స్ సంఘ నాయకులు విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీహరిపురంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చీదెళ్ల కొండలరావు టైలర్స్ డే జెండాను ఎగుర వేసి టైలర్స్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక టైలర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మాదిరెడ్డి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కట్టా ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

### నూజివీడు నియోజకవర్గంలో..

నూజివీడు టౌన్/చాట్రాయి : టైలర్లను కార్మికులుగా గుర్తించి వారికి నూతన సాంకేతికతలను అందిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచాలని టైలర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. పట్టణంలో టైలర్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో టైలర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణిని అసోసియేషన్ నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దాసిరెడ్డి అనిల్‌కుమార్, అధ్యక్షుడు ఎమ్డీ రఫీ, సెక్రటరి ఎస్.కె షబ్బీర్, ట్రెజరర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి మండలం చిన్నంపేటలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడుతూ కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్ హో జయంతి సందర్భంగా టైలర్‌డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు సుబ్బలక్ష్మి, చెన్నమ్మ, నాగలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

## రిటైర్డు టీచర్ ప్రసాదరావుకు ఘనంగా వీడ్కోలు

చాట్రాయి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం కోనేరు కాలనీ ప్రాథమిక పాఠశాల టీచర్ పగుట్ల ప్రసాదరావు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ప్రజాప్రతినిధులు అధికారులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ప్రసాదరావు అంకితభావంతో సేవలందించి విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. ఎంఈవో-1 సర్వేశ్వరరావు, విస్సన్నపేట ఎంపీడీవో రాట్నాలు, చిట్టిబాబు, మోరంపూడి శ్రీనివాసరావు, యర్రా ప్రసాద్, నక్కా రాము, ఎంఈవో-2 బ్రహ్మచారి, హెచ్ఎం ఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదరావును సన్మానిస్తున్న ఎంపీడీవో తదితరులు

### విద్యుత్ ఎల్ఐ దుర్గారావుకు సత్కారం

తుమ్మగూడెం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన దుర్గారావును చాట్రాయి సబ్ స్టేషన్‌లో డీఈ సత్యనారాయణ, ఏడి రామకృష్ణ ఏఈ సంజయ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

కైకలూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి 15 వరకు జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. 1వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. కైకలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా హాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 359 మంది, రెండో సంవత్సరం 300 మంది పరీక్షకు హాజరుకానున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే.రవిచంద్ర, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాంబాబు తెలిపారు. విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 242 మంది, రెండో సంవత్సరం 130 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ పరీక్షా కేంద్రాల్లోనే పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అధ్యాపక బృందం సైతం సెల్‌ఫోన్లు వినియోగించరాదన్నారు.

**చాట్రాయి :** ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో చాట్రా యి జడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. తొలి రోజు సంస్కృతం, తెలుగు పరీక్షలు జరగనున్నాయి. చిన్నంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, చాట్రాయి వికాస్ కాలేజి విద్యార్థులు మొదటి సంవత్సరం 150 మంది. ద్వితీయ సంవత్సరం 90 మంది పరీక్షలు రాయనున్నారు. మండలంలోని ఇంటర్ విద్యార్థులు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో పరీక్షలు రాసేవారు. జిల్లాల పునర్విభజన కారణంగా ఇక్కడ ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

**ముదినేపల్లి :** ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జి.సుధాకర్ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. మూడు కళాశాలలకు చెందిన 197 మంది ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయనుండగా, 121 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మార్చి 3 నుంచి పరీక్షలు రాయనున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.



ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు

## మేరీమాత ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

### సీఐ రవికుమార్

కలిదిండి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మార్చి 1 నుంచి మూడు రోజులపాటు జరిగే మేరీమాత ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మేరీమాత చర్చిని సందర్శించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తుల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. చర్చి ప్రధాన రహదారిపై వాహనాలు స్తంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కలిదిండి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో ఐదు రోజులుగా జరుగుతున్న పాతాళ భోగేశ్వ రస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అర్చకస్వాములు, ఆలయ వ్యవస్థాపక కుటుంబసభ్యులు స్వామి, అమ్మవార్లకు పంచబుగ్గల కోనేరులో త్రిశూల స్నానం చేయించారు. అనంతరం ధ్వజఅవరోహణం, స్వామి, అమ్మవారి పవళింపు సేవ నిర్వహించారు.



పుల్లా డ్రెయిన్‌లో చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వాసురాజు

## పుల్లా డ్రెయిన్ అభివృద్ధి పనులు

కైకలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలోనే డ్రెయిన్లను అభివృద్ధి చేసి వర్షాకాలంలో ముంపు లేకుండా చర్యలు చేపడుతున్నట్టు డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. శుక్రవారం రామవరం వద్ద పుల్లా డ్రెయిన్‌లో పంటి ఉప యోగించి ఎక్స్‌కవేటర్‌తో కిక్కిస, గుర్రపుడెక్కను తొలగించే పనులను పరిశీలించారు. వేసవిలో కాలంవల ఆధునికీరణ పనులు సాధ్యమని ఈ సమయంలో చేయాల్సిన పనులను యుద్ధప్రాతిపాదికన నిర్వహిస్తామన్నారు. మరికొన్ని డ్రెయిన్లను పంటిని ఉపయోగించి తవ్వకాలు చేస్తామని తెలిపారు.

## పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు : ఎంపీడీవో

ముదినేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. మండలంలో 8846 మంది పెన్షనర్లకు రూ.3.80 కోట్లు పంపిణీ చేయనున్నట్లు, ఇందుకు అవసరమైన నగదు సిద్ధం చే సినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేస్తారని, సచివాలయాలకు పెన్షనర్లు రావాల్సిన అవసరం లేదన్నారు.



కబడ్డీ విజేతలను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత

## జిల్లాస్థాయి కబడ్డీ విజేత ఆగిరిపల్లి జట్టు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక, లైఫ్ సేవా సంఘాల ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఆగిరిపల్లి ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన పోటీల్లో 23 జట్లు పాల్గొనగా ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ జట్టు విజేత నిలిచింది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఎల్.గోపీచంద్, ఎం.ప్రహర్ష, ఆర్. విజయ్ బాబు, సిహెచ్ అభిలాష్, నాగరోహిత్‌ను హెచ్ఎం పి.పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు.

## లైబ్రేరియన్ ఉద్యోగ విరమణ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని జడ్పీ హైస్కూల్ లైబ్రేరియన్ లక్ష్మీపురపు రాంబాబు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. రాంబాబు దంపతులను పాఠశాల హెచ్ఎం పి.పుష్పలత, పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సన్మానించారు.

## చిత్తపూరులో ఐదు లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తపూరులో శుక్రవారం ఎక్సైజ్ దాడిలో ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేసిన వడిత్యా సక్రుపై కేసు నమోదు చేశామని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. పణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

| బ్రాయిలర్ ధరలు | |
|---|---|
| అమరావతి | (రూ.లలో) |
| బ్రాయిలర్ బర్డ్ | 95, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 180 |
| చికెన్ స్కిన్‌లెస్ | 190 |
| నెక్ కోడి గుడ్డు ధర | (100) |
| విజయవాడ జోన్ రైతు ధర | రూ.475 |



దాకరం యూపీ స్కూల్లో మిస్సైల్ తయారు చేసిన విద్యార్థులు



త్రివిధ సైన్స్ సెంటర్లో ఆసక్తిగా తిలకిస్తున్న డీవైఈవో

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

కైకలూరు/ముదినేపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపునకు సైన్స్ దినోత్సవం ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అన్నారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల రెయిన్‌బో సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమవరం డీఎన్నార్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీఎస్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయప్రకాశ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ముదినేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో సైన్సుకు సంబంధించిన పలు చిత్రాలు, పరికరాలను విద్యార్థులు ప్రదర్శించారు. జిల్లా పరిషత్తు, యూపీ పాఠశాలల్లో విద్యార్థులకు సైన్స్ క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలతో పాటు సైన్స్ ప్రదర్శనలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. దాకరం యూపీ స్కూల్‌లో విద్యార్థులు మిసైల్స్‌తో పాటు పలు రకాల పరికరాలను తయారు చేశారు. పెదపాలపర్రు హైస్కూల్‌లో హెచ్ఎం పాండు రంగారావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

### నూజివీడు నియోజకవర్గంలో..

● నూజివీడు టౌన్/చాట్రాయి/ఆగిరిపల్లి : జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివిధ పాఠశాలలో సైన్స్ సెంటర్‌ను డీవైఈవో సేవియ్యా నాయక్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో త్రివిధ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చాట్రాయి మండలం తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి ఈదర ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.శారద ఆధ్వర్యంలో సైన్స్‌డే నిర్వహించారు. సైన్స్‌కు సంబంధించి పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొం దించారన్నారు. సర్పంచ్ అనిత, ఏసుపాదం, విద్యా కమిటీ చైర్మన్ కె.అంజయ్య, అయ్యంకి సురేష్‌బాబు, మేరి మరియమ్మ, ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆగిరిపల్లిలోని ఎస్వీ పబ్లిక్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కె.ఆనంద్‌బాబు పాల్గొన్నారు. సురవరం, ఆగిరిపల్లి హైస్కూల్లో సైన్స్‌డే నిర్వహించారు.

## ముగిసిన బలివే ఉత్సవాలు

ముసునూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు శుక్రవారం అమావాస్య స్నానాలకు భక్తులు పోటెత్తారు. తమ్మిలేరులో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు మంగళవాయిద్యాలతో స్వామివారి కల్యాణమూర్తులకు పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి బిందెతీర్థం, బలిహరణ, వసంతోత్సవం, సాయంత్రం హోమం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షణలు, రాత్రి ధ్వజావరోహణ, స్వామివారి పవళింపు సేవ కార్యాక్రమాలను ప్రధాన అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో పటిష్ఠ బందోబస్తు నడుమ, అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలు విజయ వంతంగా ముగిశాయి. ఉత్సవాల నోడల్ అధికారి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఫెస్టివల్ అధికారి అనురాధ, ఎంపీడీవో జి.రాణి, ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య, ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భోగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.11,71,947

కలిదిండి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి శుక్రవారం కలిదిండి భోగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కించారు. 11 లక్షల 71 వేల 947 రూపాయలు నగదు వచ్చిందని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. గుడివాడ దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ వి.సుధాకర్, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

### ఇంటర్వ్యూ..

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వి.శ్రీనివాస్



**● మండలంలో జలజీవన్ మిషన్ పనులు ఎలా సాగుతున్నాయి?**

జవాబు : మండలంలోని 29 పంచాయతీలకు గాను పది పంచాయతీల్లో ప్రస్తుతం జలజీవన్ మిషన్ పనులు సాగుతున్నాయి. మరో ఐదు పంచాయతీల్లో పనులు పూర్తయ్యాయి.

**● వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు?**

జవాబు : ప్రస్తుతం కాల్వ ద్వారా నీరు అందిస్తున్నాం. దీన్నే చెరువుల్లో నింపాలని సూచిస్తున్నాం. ఏప్రిల్‌లో మరోసారి నీటి విడుదల ఉంటుంది. పూర్తిస్థాయిలో నింపి నీటి ఎద్దడి లేకుండా చూస్తాం.

**● ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లీనింగ్ ?**

జవాబు : గ్రామీణ రక్షిత మంచినీటి పథకంలో ఎంతో ముఖ్యమైన ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లీనింగ్ ప్రతీ 15 రోజులకు చేస్తున్నాం. వివరాలు అక్కడ బోర్డులో కూడా నమోదు చేస్తున్నాం.

**● నూతనంగా మైక్రో ఫిల్టర్ ద్వారా నీరందిస్తున్న గ్రామాలు?**

జవాబు : భైరవపట్నం, మణుగులూరు, దయ్యంపాడు, ప్రత్తిపాడు గ్రామాలకు ఇప్పటికే మైక్రో ఫిల్టర్లు బిగించి మంచి నీటిని అందిస్తున్నాం.

**● ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా డ్రెయినేజీలు నిర్మిస్తున్నారా ?**

జవాబు : మండల కేంద్రంలో ఐదు వర్కులు రూ2 లక్షల చొప్పున పక్కా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు.

- మండవల్లి

## గూడ్స్ రైలు ఢీకొని యువకుడి దుర్మరణం


మండవల్లి ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండవల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఒక యువకుడు గురువారం రాత్రి ప్రమాదావశాత్తూ గూడ్స్ ట్రైన్ ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పేరి ఆంజనేయులు (19) ఐటీఐ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొండ్రాయి చెరువు ఎదురుగా రాత్రి సుమారు 10 గంటల సమయంలో గూడ్స్ ట్రైన్ ఢీకొట్టడంతో మృతి చెందాడు.



ముసునూరులో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈవో సుబ్బారావు

## టెన్త్ విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

ముసునూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని ఎంఈవో బీవీఎస్. సుబ్బారావు అన్నారు. ముసునూరు జడ్పీ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి జవాబులు రాబట్టారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా శ్రద్ధగా చదివి పరీక్షలు బాగా రాయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని ఎంఈవో హెచ్చరించారు.



బలివే తమ్మిలేరులో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

## మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ముసునూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బలివే తమ్మిలేరులో నీట మునిగి మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నూజివీడు సమితి నేతలు నిమ్మగడ్డ నరసింహ, రాయంకుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. బలివే తమ్మిలేరులో సంఘటనా స్థలాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. నరసింహ మాట్లాడుతూ ఉత్సవాల్లో ముగ్గురు యువకులు తమ్మిలేరులో మృతి చెందడం బాధాకరమన్నారు. ఇద్దరు యువకులు మరణించిన 24 గంటలు గడవకముందే మరొకరి మృతికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. సీహెచ్. వెంకటేశ్వరరావు, కె.ఆనంద్ పాల్గొన్నారు.